ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి



# విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక

VISION ANDHRA TELUGU DAILY


విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రికలో రిపోర్టర్లు కావలెను
తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను
సంప్రదించవలసిన ఫోన్ నంబర్స్ :
9440897445, 8074636674

శుక్రవారం 28-8-2026 | Friday 28 AUGUST, 2026 | విజయవాడ Vijayawada | పేజీలు: 8 | వెల: రూ.1.00 | PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA
సంపుటి: 01 సంచిక: 212 | Vol.No 01 Issue No . 212 | www.visionandhra.in



## అమరావతి పనులపై చంద్రబాబు సమీక్ష

### – ఏపీసీఆర్డీఏ 65వ అథారిటీ సమావేశం.. నిర్మాణాల పురోగతిపై ఆరా

అమరావతి:ఆగష్టు 27 (విజన్ ఆంధ్ర)


సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఏపీసీఆర్డీఏ 65వ అథారిటీ సమావేశం జరిగింది.

రాజధాని అమరావతిలో జరుగుతున్న వివిధ నిర్మాణ పనుల పురోగతిపై సమావేశంలో ముఖ్యమంత్రి సమీక్షించారు.సమావేశానికి మంత్రులు నారాయణ, పయ్యావుల కేశవ్, పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్‌కుమార్, సీఆర్డీఏ కమిషనర్ విజయ్‌రామరాజు తదితరులు హాజరయ్యారు. అమరావతిలో చేపడుతున్న నిర్మాణ పనుల ప్రస్తుత పరిస్థితి, పురోగతికి సంబంధించిన వివరాలను అధికారులను చంద్రబాబు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కాంట్రాక్ట్ సంస్థల ప్రతినిధులతోనూ ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. పనులను నిర్ణీత గడువులో పూర్తి చేసేలా సమన్వయంతో ముందుకు సాగాలని సూచించినట్లు సమాచారం.



## క్రీడాస్ఫూర్తితో దేశ ప్రగతి...

### జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా యువ అథ్లెట్లతో మోదీ ముచ్చట



న్యూఢిల్లీ:ఆగష్టు 27 (విజన్ ఆంధ్ర) దేశ యువత, క్రీడాకారులకు ప్రధాని నరేంద్ర మోదీ జాతీయ క్రీడా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. గురువారం నిర్వహించిన ఖేలో ఇండియా సంవాద్ కార్యక్రమంలో ఆయన వర్చువల్‌గా పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న యువ అథ్లెట్లతో మోదీ సంభాషించారు.అనంతరం యువతను ఉద్దేశించి మాట్లాడుతూ క్రీడలు కేవలం పతకాలు సాధించడానికే పరిమితం కావని అన్నారు. యువతలోని చైతన్యాన్ని మేల్కొలిపే శక్తి క్రీడలకు ఉందని పేర్కొన్నారు. ఆటలు యువశక్తిని వెలికితీస్తాయని చెప్పారు.దేశం అభివృద్ధి పథంలో వేగంగా ముందుకు సాగేందుకు యువశక్తితో పాటు క్రీడాసక్తి కూడా ఎంతో అవసరమని ప్రధాని మోదీ అన్నారు. యువత క్రీడలను జీవితంలో భాగంగా చేసుకుని దేశానికి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు.

## మంగళగిరిలో మోడరన్ రైతు బజార్ కు మంత్రి లోకేష్ శంకుస్థాపన

**5.90 ఎకరాల్లో రూ.18.55 కోట్ల వ్యయంతో మోడరన్ రైతు బజార్ నిర్మాణం**

మంగళగిరి: ఆగష్టు 27 (విజన్ ఆంధ్ర)

దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా మంగళగిరిని తీర్చిదిద్దేందుకు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో వేగంగా అడుగులు పడుతున్నాయి. మంగళగిరి పట్టణం నిడమర్రు రైల్వే గేట్ వద్ద ఆధునిక హంగులతో మోడరన్ రైతు బజార్ నిర్మాణ పనులకు గురువారం విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ భూమిపూజ, శంకుస్థాపన చేశారు. ముందుగా నిడమర్రు రోడ్డులోని శంకుస్థాపన ప్రాంగణానికి చేరుకున్న మంత్రి లోకేష్ కు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం మోడరన్ రైతు బజార్ నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ప్రాజెక్టు నమూనా చిత్రాలను పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు.

**ఆధునిక హంగులతో మంగళగిరిలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఏర్పాటు**

మంగళగిరి ప్రజలు, రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మంత్రి లోకేష్ మోడరన్ రైతు బజార్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. 5.90 ఎకరాల విస్తీర్ణంలో, అరబిందో ఫార్మా ట్రస్ట్ సీఎస్ఆర్ నిధులు రూ.18.55 కోట్ల వ్యయంతో ఈ రిటైల్&హోల్ సేల్ కూరగాయల మార్కెట్ ను నిర్మించనున్నారు. ఆధునిక సౌకర్యాలతో పరిశుభ్రంగా, వినియోగదారులకు అనుకూలంగా, పర్యావరణహితంగా ఉండేలా ఈ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ను ఏర్పాటుచేయనున్నారు. మొత్తం నిర్మాణ విస్తీర్ణం 71,925 చదరపు అడుగులు. రిటైల్ మార్కెట్ లో కూరగాయల విక్రయాల కోసం 102 స్టాళ్లు, పండ్లు, పూల విక్రయాల కోసం 54 ప్రత్యేక స్టాళ్లు ఏర్పాటు చేస్తారు. ఇతర రకాల వస్తువుల కోసం మొత్తం 60 షాపులు ఏర్పాటుచేస్తారు. హోల్ సేల్ మార్కెట్ లో అన్ లోడింగ్ ప్లాట్ ఫామ్స్ 18, కూరగాయల షాపులు 23 ఉండనున్నాయి. కోల్డ్ స్టోరేజీ, వెజిటబుల్ వాష్ ఏరియాస్, అడ్మిన్, మెయింటెనెన్స్ ఏరియాస్, క్యాంటీన్, మరుగుదొడ్లు నిర్మించనున్నారు. సరుకులు తరలించే వాహనాలు, టూ వీలర్స్, ఫోర్ వీలర్స్ కోసం పార్కింగ్ సౌకర్యం కల్పించనున్నారు.ఈ కార్యక్రమంలో అరబిందో ఫార్మా ట్రస్ట్ వైస్ ప్రెసిడెంట్ జీ.భీముడు, ఎంటీఎంసీ కమిషనర్ షేక్ అలీమ్ బాషా, పద్మశాలీ వెల్ఫేర్ అండ్ డెవలప్ మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, ఏపీఎంఎస్ఐడీసీ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకీ దేవి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు గుత్తికొండ ధనుంజయరావు, గుంటూరు పార్లమెంట్ టీడీపీ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, మంగళగిరి పట్టణ టీడీపీ అధ్యక్షుడు పడవల మహేష్, రూరల్ అధ్యక్షుడు పల్లబోతుల శ్రీనివాసరావు, తాడేపల్లి పట్టణ టీడీపీ అధ్యక్షుడు వల్లభనేని వెంకట్రావు, దుగ్గిరాల మండల టీడీపీ అధ్యక్షురాలు కేశంనేని శ్రీఅనిత పాల్గొన్నారు.

## వైసీపీ హయాంలో ఇరిగేషన్ వ్యవస్థ విధ్వంసం.. పోలవరాన్ని గాడిలో పెట్టాం

### :మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



అమరావతి:ఆగష్టు 27 (విజన్ ఆంధ్ర)

వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులను సర్వనాశనం చేశారని రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రంగా విమర్శించారు. గతంలో ముఖ్యమంత్రిగా ఉన్న జగన్ పోలవరం పనులను నిర్లక్ష్యం చేయకుండా కొనసాగించి ఉంటే రాష్ట్రంలో ఎల్‌నినో పరిస్థితులు ఏర్పడినా రైతులకు ఇబ్బందులు ఉండేవి కాదని అన్నారు.టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేవలం 16 నెలల్లోనే హంద్రీనీవా ప్రాజెక్టుపై రూ.3,500 కోట్లు ఖర్చు చేసి కడప, అనంతపురం, చిత్తూరు జిల్లాలకు సాగునీరు అందించామని అచ్చెన్నాయుడు తెలిపారు. గతంలో 74 శాతం పూర్తయిన పోలవరం ప్రాజెక్టును వైసీపీ ప్రభుత్వం కొనసాగించి ఉంటే సమస్యలు పరిష్కారమయ్యేవని అన్నారు. అయితే ప్రాజెక్టును గోదావరి వరదల్లో ముంచి నాశనం చేశారని ఆరోపించారు.

ప్రస్తుతం పోలవరం ప్రాజెక్టును తమ ప్రభుత్వం తిరిగి గాడిలో పెట్టిందని మంత్రి తెలిపారు. వచ్చే ఏడాది గోదావరి పుష్కరాల నాటికి ప్రాజెక్టును ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామని వెల్లడించారు.

**వెలిగొండను పూర్తి చేస్తున్నాం**

1995లో వెలిగొండ ప్రాజెక్టుకు చంద్రబాబు శంకుస్థాపన చేశారని, ఇప్పుడు ఆయనే ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేయబోతున్నారని అచ్చెన్నాయుడు తెలిపారు. గతంలో తొండలు కూడా గుడ్లు పెట్టని రాతి నేలల్లో వెలిగొండ ప్రాజెక్టును నిర్మించామని పేర్కొన్నారు. పుష్కర ఎత్తిపోతల పథకం ద్వారా గోదావరి జలాలు త్వరలోనే ఉత్తరాంధ్ర ప్రాంతాన్ని తాకబోతున్నాయని మంత్రి వెల్లడించారు. రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి రైతులకు నీటి భద్రత కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

## చిలకలూరిపేట రోడ్డు ప్రమాదంపై జగన్ దిగ్భ్రాంతి

**– ఏడుగురి మృతి అత్యంత హృదయవిదారకం.. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలి**



తాడేపల్లి:ఆగష్టు 27 (విజన్ ఆంధ్ర)

పల్నాడు జిల్లా చిలకలూరిపేట అడ్డరోడ్డు వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మృతి చెందడంపై వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విజయవాడ నుంచి తిరుపతి వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఆటోను ఢీకొన్న ఘటనలో ఏడుగురు ప్రాణాలు కోల్పోవడం అత్యంత విషాదకరమని ఆయన పేర్కొన్నారు. మృతులంతా చిలకలూరిపేట మండలం వేలూరు గ్రామానికి చెందినవారిగా గుర్తించడం మరింత విషాదాన్ని నింపిందని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఒకే ప్రాంతానికి చెందిన పలువురు అనూహ్యంగా ప్రాణాలు కోల్పోవడం వారి కుటుంబాలకు తీరని శోకాన్ని మిగిల్చిందన్నారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారికి తక్షణమే మెరుగైన వైద్యం అందించాలని జగన్ కోరారు. క్షతగాత్రుల ప్రాణాలను కాపాడేందుకు వైద్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా రహదారి భద్రతా చర్యలను మరింత పటిష్టం చేయాలని ఆయన కోరారు. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారు త్వరగా

## నేపాల్‌లో చిక్కుకున్న ఏపీ యాత్రికుల క్షేమ సమాచారాలపై సమీక్షిస్తున్న మంత్రి నారా లోకేష్.




అమరావతి ఆగష్టు 27 (విజన్ ఆంధ్ర)

నేపాల్ వరదల్లో చిక్కుకున్న ఏడుగురు ఏపీ యాత్రీకులు క్షేమ సమాచారాలను అడిగి తెలుసుకున్న లోకేష్.

నలుగురు సురక్షితంగా ఉన్నారని... మరో ముగ్గురు ఆచూకీ లభ్యం కాలేదని తెలిపిన ఏపీ ఢిల్లీ భవన్ అధికారులు.

కుప్పం ప్రాంతానికి చెందిన బాల సుబ్రహ్మణ్యం, ఈషా ఫౌండేషన్ గ్రూప్ కు చెందిన శశికుమార్, రాజ్యలక్ష్మీలు ఆచూకీ లభించలేదని వెల్లడి.

మిస్సైన ముగ్గురి ఆచూకీని కనుగొనేందుకు కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు జరపాలని లోకేష్ సూచన.

చైనాలోని గైరోంగ్ ఎంబసీ వద్ద చివరిసారిగా కనిపించిన ఈషా ఫౌండేషన్ సభ్యుడు శశికుమార్.

కైలాస మానససరోవర యాత్రకు వెళ్లి వరదల్లో చిక్కుకున్నా... క్షేమంగానే ఉన్న కర్నూలు జిల్లాకు చెందిన భాస్కర్ శాస్త్రి సహా మరో ముగ్గురు.

సురక్షితంగా ఉన్న వారిని వెంటనే తరలించేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి నారా లోకేష్ ఆదేశం.

యాత్రికుల భద్రతపై భారత రాయబార కార్యాలయం, చైనా, నేపాల్ ఎంబసీలు, గైరోంగ్ ఇమ్మిగ్రేషన్ సెంటర్, ఈషా ఫౌండేషన్ సంస్థలతో నిరంతర సంప్రదింపులు జరపాలని లోకేష్ సూచన.

నేపాల్ లో చిక్కుకున్న యాత్రీకులు, మానస సరోవర యాత్రకు వెళ్లిన ఏపీ వాసులు సమాచారాన్ని తెలుసుకుంటున్న ఆర్టీజీఎస్ అధికారులు.

మంత్రి నారా లోకేష్ సూచనల మేరకు ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి నిరంతరం మానిటర్ చేస్తున్న ఐటీ సెక్రటరీ కాటంనేని భాస్కర్.

## రెండేళ్లు బెంగళూరులో సేద తీరిన జగన్మోహన్ రెడ్డికి ఇప్పుడు ఎల్ ని నో గుర్తుకు వచ్చిందా?

**– బీసీలపై ముసలి కన్నీరు కార్చుతున్న జగన్.. నాడు రిజర్వేషన్లపై సుప్రీంకోర్టులో ఎందుకు పోరాడలేదు.**

**– సొంత జిల్లాకే ఏం చేయని జగన్.. రాయలసీమ ప్రాజెక్టులు తానే చేశానని చెప్పుకోవడం సిగ్గు చేటు.**

**– ఎల్ నినో దృష్ట్యా రైతులను కూటమి ప్రభుత్వం ముందే అప్రమత్తం చేసింది.**

**సమాచార & పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థ సారధి గారి మీడియా సమావేశం**




ఎన్టీఆర్ భవన్, మంగళగిరి
ఆగష్టు 27 (విజన్ ఆంధ్ర)

ప్రజా సమస్యలపై జగన్మోహన్ రెడ్డికి నిజమైన చిత్తశుద్ధి ఉంటే అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలి గానీ.. సొంత మీడియా ముందు మాట్లాడటం సరికాదని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థ సారధి విమర్శించారు. ఇన్ని రోజులు బెంగళూరులో సేద తీరిన జగన్మోహన్ రెడ్డికి ఇప్పుడు ఎల్ ని నో గుర్తుకు వస్తుందని ఎద్దేవా చేశారు. నిజంగా ఎల్ ని నో నివారణ, రైతు సమస్యలపై జగన్ రెడ్డి చిత్తశుద్ధి ఉంటే శాసన మండలిలో తన ఎమ్మెల్సీలతో చర్చకు ఎందుకు సిద్ధపడలేదని ప్రశ్నించారు. విలువైన శాసన మండలి సమావేశం డిప్యూటీ చైర్మన్ ను పొగడడానికే వైసీపీ ఎమ్మెల్సీలు సరిపెట్టారని విమర్శించారు. అధికారంలో ఉండగా బలహీన వర్గాలను చెరపట్టి ఇప్పుడు వాళ్లపై ముసలి కన్నీరు పెడుతున్నారని దుయ్యబట్టారు. అసెంబ్లీ సాక్షిగా బలహీన వర్గాలకు నామినేటెడ్ కాంట్రాక్టుల్లో 50శాతం రిజర్వేషన్లు కల్పిస్తానని మాట ఇచ్చిన జగన్.. ఒక్క శాతం కూడా ఇవ్వకుండా బీసీలను నిలువునా మోసగించడని గుర్తు చేశారు.

“ఐదేళ్ల కాలంలో ఒక్క కరువు నివారణ చర్య చేపట్టని బలహీన ముఖ్యమంత్రి జగన్ రెడ్డి. ఇన్ని రోజులు బెంగళూరులో ఉన్న జగన్మోహన్ రెడ్డికి ఎల్ ని నో గురించి తెలియక పోవచ్చు. ఇప్పుడు అకస్మాత్తుగా గుర్తుకు వచ్చింది. ఎల్ ని నో గట్టెక్కడానికి కూటమి ప్రభుత్వం ముందు నుంచే చర్యలు ప్రారంభించింది. మంత్రులు, కలెక్టర్లు ఇతర అధికారులకు ముందు నుంచే సీఎం గారు స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తున్నారు. తక్కువ నీటితో ఎక్కువ రాబడి తీసుకొచ్చే వరి రకాలను ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది. వరి, మినుము, పత్తి వంటి పంటలకు తక్కువ డబ్బులతోనే ఇన్సూరెన్స్ చేయిస్తోంది. ఒకే అబద్ధాన్ని 100 సార్లు చెబితే నిజం అయిపోతుందని భ్రమలో జగన్ ఇవాళ ఉన్నారు.

## చిలకలూరిపేట రోడ్డు ప్రమాదంపై ముఖ్యమంత్రి చంద్రబాబు దిగ్భ్రాంతి

అమరావతి,ఆగష్టు 27 (విజన్ ఆంధ్ర)

పల్నాడు జిల్లా చిలకలూరిపేట వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విజయవాడ నుంచి తిరుపతి వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఆటోను ఢీకొన్న ఘటనలో ఏడుగురు మృతి చెందడం, పలువురు తీవ్రంగా గాయపడటంపై సీఎం విచారం వ్యక్తం చేశారు. మృతి చెందిన వారు చిలకలూరిపేట మండలం వేలూరు గ్రామానికి చెందిన వారిగా అధికారులు వివరించారు. తీవ్రంగా గాయపడిన వారిని గుంటూరు జనరల్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. మృతుల కుటుంబాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సీఎం సూచించారు.

# సంపాదకీయం

## దారి తప్పుతున్న టీనేజ్...

పాఠశాల గేటు దాటే పిల్లల చేతుల్లో పుస్తకాలు, పెన్నులు ఉండాలి. పరీక్షల గురించి ఆలోచిస్తూ, ఆటల గురించి మాట్లాడుకుంటూ, స్నేహితులతో నవ్వుకుంటూ ఇంటికి తిరిగి రావాలి. కానీ అదే పిల్లల చేతుల్లో హత్యాయుధాలు కనిపిస్తున్నాయి. ఉపాధ్యాయులపై, తోటి విద్యార్థులపై దాడులు, డ్రగ్స్.. ఇవన్నీ పాఠశాల వయసు పిల్లల చుట్టూ విని పిస్తున్నప్పుడు "పిల్లలు చెడిపోతున్నారు" అని చెప్పి ముందుకు వెళ్లిపోవడం సరిపోదు..నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లిలో పాఠశాల ప్రిన్సిపాల్ హత్యకు సంబంధించిన ఘటనలో పదో తరగతి విద్యార్థుల ప్రమేయం ఉందన్న విషయం ఈ ఆందోళనను మరింత పెంచింది. కూకట్‌పల్లిలో తోటి విద్యార్థిపై దాడి, నిజామాబాద్‌లో విద్యార్థినిపై లైంగిక దాడికి సంబంధించిన ఘటనలు కూడా సమాజాన్ని కలవరపెడుతున్నాయి.. ఇవి కేవలం పోలీసు కేసులు కావు.. ఇవి మన విద్యా వ్యవస్థకు, కుటుంబ వ్యవస్థకు, సమాజానికి ఎదురవుతున్న ప్రశ్నలు..ఏ పిల్లవాడూ పుట్టుకతో నేరస్తుడు కాదు. ఒక పిల్లవాడు హింసాత్మకంగా మారడం వెనుక ఇంటి పరిస్థితులు, పాఠశాల లో వేధింపులు, స్నేహితుల ఒత్తిడి, మానసిక ఒత్తిడి, సోషల్ మీడియా, సినిమాలు, డ్రగ్స్, గ్యాంగ్ సంస్కృతి వంటి అనేక ప్రభావాలు ఉండవచ్చు. పిల్లవాడు అకస్మాత్తుగా ఎక్కువగా కోప్పడటం, వస్తువులు పగలగొట్టడం, తల్లిదండ్రులతో మాట్లా డటం తగ్గించడం, పాఠశాలకు వెళ్లడానికి ఇష్టపడక పోవడం, స్నేహితులను మార్చుకోవడం, ఒంటరిగా ఉండటం, హింసాత్మక వీడియోలపై ఆసక్తి చూపించడం, బెదిరింపు భాష ఉపయోగించడం వంటి మార్పులు కనిపిస్తే వెంటనే అతడిని నేరస్తుడిగా ముద్ర వేయాల్సిన అవసరం లేదు. మన సమా జంలో పిల్లవాడు తప్పు చేసిన తర్వాత స్పందిస్తాం. కానీ అతను తప్పు చేసే దిశగా వెళ్తున్నప్పుడు మాత్రం గమనించం.స్మార్ట్‌ఫోన్, సినిమాలు, వెబ్‌సిరీస్‌లు, సోషల్ మీడియా పిల్లలకు జ్ఞానం, వినోదాన్ని అందించే సాధనాలే.. కానీ అదే సమయంలో హింస, సైబర్ బుల్లీయింగ్, డ్రగ్స్, గ్యాంగ్ కల్చర్, నేరాలను గొప్పగా చూపించే కంటెంట్ కూడా వారి ముందుకు వస్తోంది. హింసను హీరోయిజంగా, ప్రతీకారాన్ని గొప్పగా, నేరాన్ని స్టైల్‌గా చూపించే దృశ్యాలను పిల్లలు పదేపదే చూస్తున్నారు.. కొన్ని సెకన్ల షార్ట్ వీడియోల కోసం గంటల తరబడి ఫోన్‌లో గడుపుతూ, పక్కనే ఉన్న తల్లిదండ్రులతో పది నిమిషాలు మాట్లాడలేని పరిస్థితి కూడా ఏర్పడుతోంది. అయితే పిల్లల ప్రవర్తనకు ఫోన్, సినిమాలనే పూర్తిగా కారణంగా చూపడం కూడా సరైంది కాదు. సమస్య సాధ నాల్లో కంటే వాటిని పిల్లలు ఎలా ఉపయోగిస్తున్నారు, వారు చూస్తున్న కంటెంట్‌ను ఎలా అర్థం చేసుకుంటున్నారనే దాంట్లో ఉంది. అందుకే తల్లిదండ్రులు ఫోన్ లాక్కోవడం లేదా సినిమాలను నిందించడం మాత్రమే కాకుండా పిల్లలతో కలిసి కంటెంట్ గురించి మాట్లాడాలి.ఇప్పటి తల్లిదండ్రులకు మంచి పాఠశాలలో చదివించడం, సౌకర్యాలు కల్పించడం, ఖరీదైన ఫోన్ కొనివ్వడం తెలుసు.. కానీ పిల్లలతో ప్రశాంతంగా కూర్చొని మాట్లాడటానికి సమయం లేకపోవడం పెద్ద సమస్య. చదివావా ఎన్ని మార్కులు వస్తాయని అడగడం మాత్రమే కాదు. ఎలా ఉన్నావు.. ఏమైనా సమస్య ఉందా? ఎవరైనా ఇబ్బంది పెడుతున్నారా అని కూడా అడగాలి. పిల్లల చేతిలో ఫోన్ ఉందా లేదా అనేది మాత్రమే చూడటం కాదు. ఆ ఫోన్ కంటే ముందు వారి మనసులో ఏం జరుగుతుందో చూడాలి. పిల్లల నేరాలను కేవలం పోలీసుల సమస్యగా చూడలేం. ఇది కుటుం బం, పాఠశాల, ప్రభుత్వం, మీడియా, సినిమా, సోషల్ మీడి యా, సమాజం.. అందరి బాధ్యత. నేరం జరిగిన తర్వాత శిక్షిం చడం అవసరం. కానీ అంతకంటే ముఖ్యమైనది నేరం జరిగే పరిస్థితులను ముందే గుర్తించడం. పిల్లల చేతుల్లో కత్తులు వచ్చిన తర్వాత మార్చడం కంటే, ఆ కత్తి అవసరం అనిపించని బాల్యాన్ని నిర్మించడం మన అసలు లక్ష్యం కావాలి.నవ మాసాలు మోసి, కని, పెంచి, పెద్ద చేసి, తమ పిల్లలు ప్రయోజకులై ఉన్నత స్థాయికి ఎదగాలని ప్రతి తల్లిదండ్రి కలలు కంటారు.. అయితే పిల్లలను పెంచడం మాత్రమే కాకుండా, వారిని సన్మార్గంలో నడిపించడం కూడా తల్లిదండ్రుల గురుతరమైన బాధ్యత. ముఖ్యంగా ప్రస్తుత కాలంలో సెల్‌ఫోన్లు, సామాజిక మాధ్యమాల ప్రభావం పిల్లలపై తీవ్రంగా పడుతున్న నేపథ్యంలో, వారు చెడు అలవాట్లకు బానిసలు కాకుండా తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పిల్లల నడవడికను, వారి ఆలోచనా విధానాన్ని, స్నేహ సంబంధాలను, సామాజిక మాధ్యమాల వినియోగాన్ని తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు గమనిస్తూ, వారికి సరైన మార్గదర్శకత్వం అందించాలి. అంతేకాకుండా పెద్దల పట్ల గౌరవం, చిన్నల పట్ల ప్రేమ, సమాజం పట్ల బాధ్యత వంటి సద్గుణాలను అలవర్చాలి. పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో తల్లిదండ్రుల పాత్ర అత్యంత కీలకమైనది.ఏ లక్ష్యం కోసం అయితే, ఏ ఆశయం కోసం అయితే విద్యార్థులు మన చెంతకు చేరుతున్నారో, వారి ఆశయాలను నెరవేర్చడానికి గురువులుగా అంకితభావంతో పనిచేయవలసిన గురుతర బాధ్యత ప్రతి ఒక్క ఉపాధ్యాయుడిపై ఉంది. విద్యార్థులను తమ సొంత పిల్లలుగా భావించి, వారి సర్వతోముఖాభివృద్ధికి తోడ్పాటునందించాలి. విద్యార్థులలో క్రమశిక్షణ లోపించకుండా, చెడు అలవాట్లకు దూరంగా ఉండేటట్లు ప్రతి పిల్లవాడిని తీర్చిదిద్ద వలసిన బాధ్యత అందరిపై ఉంది. 'కొందరు చేస్తారు - మేము మాత్రం చూస్తాం' అనే కొందరి ఉపాధ్యాయుల బాధ్యతారాహిత్యం వలన మొత్తం ఉపా ధ్యాయ లోకం అభాసుపాలు అయ్యే అవకాశం ఉంది. కావున పిల్లలలో క్రమశిక్షణను పెంపొందించడంలో ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు భాగస్వామ్యం కావాల్సిన అవసరం తప్పనిసరి.విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండేటట్లు, క్రమశిక్షణ పొంపొందించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. విద్యాలయాలకు కిలోమీటర్ దూరంగా ఎలాంటి మత్తు పదార్థాలనుగాని ఇతర ధూమపాన వస్తువులను విక్రయించకుండా నిషేధించాలి. ఒకవేళ అనధికారికంగా మత్తు పదార్థాలను విక్రయించే వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి. క్రమశిక్షణ లోపించిన విద్యార్థులలో, క్రమశిక్షణ పెంపొందించడానికి కౌన్సిలింగ్ సెంట ర్లను ఏర్పాటు చేయాలి. ఏది ఏమైనప్పటికీ ఆధునిక కాలంలో కూడా విద్యార్థులలో సన్నగిల్లుతున్న క్రమశిక్షణను దారిలో పెట్టడానికి, తల్లిదండ్రులు, గురువులు, ప్రభుత్వం, సమాజ భాగస్వామ్యంతో కలిసి విద్యార్థులలో విలువలతో కూడిన విద్యను అందించి, వారిలో సత్ప్రవర్తనను పెంపొందించేటట్లు చూడాలి.

### రెండేళ్లు బెంగళూరులో సేద తీరిన జగన్మోహన్ రెడ్డికి

# ఇప్పుడు ఎల్ ని నో గుర్తుకు వచ్చిందా?

మొదటిపేజీ తరువాయి

చెప్పుకోవడానికి ఏమీ లేక కూటమి ప్రభుత్వంపై విషం చిమ్ముతూ అబద్ధాల్ని ప్రచారం చేస్తున్నారు. జగన్ చెప్పే అబద్ధాలను నమ్మే పరిస్థితుల్లో ఇవాళ రాష్ట్ర ప్రజలు లేరు. ప్రజా సమస్యలను పరిష్కరించాలనే ఆలోచన నిజంగా జగన్ రెడ్డికి ఉంటే అసెంబ్లీకి రావాలి. రాష్ట్రంలో నిరుద్యోగ యువతీ యువకులకి చేసిన గొడ్డలి వేటు, విధ్వంసం బయటపడుతుందని జగన్ ఇవాళ అసెంబ్లీకి రావడం లేదు."

శాసనమండలిలో ఎల్ ని నోపై చర్చకు ఎందుకు రాలేదు

"రైతులపై మొసలి కన్నీరు కార్చుతున్న జగన్ ఎల్ ని నోపై శాసన మండలిలో వాళ్ల ఎమ్మెల్సీలు ఎందుకు చర్చకు రాలేదు. విలువైన శాసనమండలి సమయాన్ని డిప్యూటీ చైర్మన్ ను పొగడడానికే సరిపెట్టారు. నాలుగు గంటలు ఏక ధాటిగా కూటమి ప్రభుత్వంపై విషం చిమ్ముతూ డిప్యూటీ చైర్మన్ ను పొగడానికి ఉపయోగించారు. పత్రికా ప్రకటనల ద్వారా సానుభూతి ప్రకటిస్తే సమస్యలు పరిష్కారం కావు. జగన్ ఇది వరకు ఆవు కథ ఒక్కటే చెప్పేవారు. ఇప్పుడు కోతి, పులి కథలు చెబుతున్నారు. రాష్ట్రానికి ప్రాణంగా భావించే పోలవరం పనులను జగన్ అటకెక్కించాడు. కేవలం 5శాతం పనులు మాత్రమే చేసి ఉత్తరాంధ్ర ప్రజలకు తీరని అన్యాయం చేశారు. నేడు పోలవరం పనులు దాదాపుగా పూర్తి చేసాం. సెప్టెంబర్ 3వ తేదీ నాటికి పోలవరం జలాలను ఉత్తరాంధ్రకు తీసుకొస్తున్నాం. చింతలపూడి ప్రాజెక్ట్ కోసం చంద్రబాబు నాయుడు గారు రూ. 4వేల కోట్లు ఖర్చు చేశారు. కృష్ణా నది జలాలు ఇవ్వకుండా రైతాంగాన్ని మోసం చేస్తున్నారని వైసీపీ నాయకులు అంటున్నారు. మరోపక్క తెలంగాణలో కృష్ణా నీళ్లు ఆంధ్ర ప్రజలు దోచుకుంటున్నారు అని ప్రచారం చేయిస్తున్నారు. ప్రకాశం బ్యారేజ్ నుంచి కాలువల ద్వారా రైతుల వరి నాట్లు కాపాడుకోవడానికి నీళ్లు వదిలితే అది కూడా జగన్మోహన్ రెడ్డి దృష్టిలో తప్పే."

నాడు అసెంబ్లీ సాక్షిగా బీసీలను మోసగించిన వ్యక్తి జగన్

"బీసీలకు 44శాతం పార్లమెంట్ స్థానాలు, 40శాతం జిల్లా పరిషత్ స్థానాలు ఇచ్చానని పచ్చి అబద్దాలు చెప్పుకుంటున్న జగన్.. బీసీలకు 34శాతం రిజర్వేషన్లపై ఎందుకు అంత చిత్తశుద్ధి ప్రదర్శించలేదు. రిజర్వేషన్‌లను హైకోర్టు వ్యతిరేకిస్తే సుప్రీం కోర్టుకు వెళ్లి ఎందుకు పోరాడలేదు. జగన్ నిర్వాకంతో 16,800 మంది బలహీన వర్గాల వారికి పదవులు లేకుండా పోయాయి. బీసీలకు మొదటి నుంచి మేలు చేకూర్చిన పార్టీ తెలుగుదేశం. నాడు 1995లో ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నాయుడు గారు ప్రత్యేక చట్టం చేసి బీసీలకు 34శాతం రిజర్వేషన్లు ఇచ్చారు. ఆ చట్టం ప్రకారమే 2019 ఎన్నికల వరకు బీసీలకు ఈ రిజర్వేషన్లు ఉపయోగపడ్డాయి. శాసనసభ సాక్షిగా బలహీన వర్గాలకు నామినేటెడ్ కాంట్రాక్ట్స్ లో లేదా ప్రభుత్వం చేసే వ్యాపారాల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పిస్తానని మాట ఇచ్చి మాట తప్పిన వ్యక్తి జగన్. నేతి బీరకాయలో నేతి లేనిది ఎంత నిజమే జగన్ మాటలు కూడా అంతే. బీసీలపై అంత ప్రేమ ఉంటే యూనివర్సిటీల్లో ఒక్కరికైనా వెనుకబడిన వర్గాల వారికి వైస్ చాన్సలర్ పదవి ఇచ్చావా జగన్? అధికారంలో ఉండగా బీసీల భూములు కొట్టేశారు. అనేక మందిని నరికి చంపారు. నేడు బీసీలపై మొసలి ప్రేమ చూపిస్తున్నారు."

రాయలసీమ రైతాంగానికి జగన్ చేసింది శూన్యం

"రాయలసీమ ప్రాజెక్టులకు జగన్ ఖర్చు పెట్టింది కేవలం రూ. 2000 కోట్లు మాత్రమే అంటే 100 రూపాయలకి 1.60 పైసలు మాత్రమే. నేడు కూటమి ప్రభుత్వం రాయలసీమ సాగు, తాగు నీటి ప్రాజెక్టులకు రెండేళ్లలో రూ. 13,500 కోట్లు ఖర్చు పెట్టి మరో 10వేల కోట్లు ఖర్చు పెట్టడానికి సిద్ధ పడింది. సొంత జిల్లాలో ఉంటే స్టీల్ ప్లాంట్ కు రెండు సార్లు కొబ్బరి కాయలు కొట్టిన జగన్ ఒక్క ఇటుక కూడా పేర్చారా? నేడు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ స్టీల్ అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. అంతే లక్షల కోట్లతో అనేక ప్రాజెక్టులను నెలకొల్పుతున్నాం. గ్రీన్ ఎనర్జీలో అనేక పెట్టుబడులు వస్తున్నాయి. కొప్పర్తి, ఓర్వకల్లు పారిశ్రామిక కారిడార్లు అభివృద్ధి చెందుతున్నాయి."

"మద్యం కేసులో ఇవాళ అరెస్టు అవుతున్న నాయకులను రాష్ట్ర ప్రభుత్వం అరెస్టు చేయించడం లేదు. కేంద్ర దర్యాప్తు సంస్థైనా ఈడీ అరెస్టు చేస్తోంది. అంతే కాదు అరెస్టు అయిన వాళ్లు సుప్రీం కోర్టు సైతం బెయిల్ నిరాకరిస్తే వాళ్లపై రాష్ట్ర ప్రభుత్వం కక్షగట్టి అరెస్టు చేయిస్తున్నట్లు జగన్మోహన్ రెడ్డి ప్రచారం చేసుకుంటున్నారు."

# వైసీపీ మాజీ మండల కన్వీనర్ భూకబ్జాలపై గ్రీవెన్స్ లో ఫిర్యాదు

- హద్దు రాళ్లు తొలగించి భూ ఆక్రమణకు యత్నం.. చర్యలు తీసుకోవాలంటూ వినతి
- నకిలీ డీకేటీ పట్టాలతో బరితెగింపు.. ట్రాక్టర్‌తో మామిడి తోట ధ్వంసం
- తండ్రి అనారోగ్యాన్ని ఆసరాగా చేసుకుని దగా.. రూ. 60 లక్షల ఉమ్మడి ఆస్తిని కాజేసిన అన్నలు
- తెనాలిలో బినామీ రియల్టర్ల బరితెగింపు.. ప్రైవేట్ ప్లాట్లు, పంట కాలువ స్వాహా చేసిన కబ్జాదారులు
- అర్జీలు స్వీకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేసిన నేతలు
- పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖ మంత్రి టి.జి. భరత్, ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ ఛైర్మన్ మన్నవ మోహన కృష్ణ



(విజన్ ఆంధ్ర)

తిరుపతి జిల్లా బీఎన్ కండ్రిగ మండలం నర్సాకోట గ్రామానికి చెందిన మునిసుబ్బయ్య నేడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజావినతుల స్వీకరణ కార్యక్రమంలో నేతలకు అర్జీ ఇచ్చి అభ్యర్థిస్తూ.. వైసీపీ మండల మాజీ కన్వీనర్ ఆరణి విద్యానాథరెడ్డి బీఎన్ కండ్రిగ మండలంలో సుమారు 300 ఎకరాలు, వరదయ్యపాళెం మండలంలో మరో 200 ఎకరాల ప్రభుత్వ భూములను ఆక్రమించారు. చెరువులు, కుంటలు, అనాధీనం, పోరంబోకు భూములతో పాటు నిరుపేద ఎస్సీ, ఎస్టీలకు చెందిన అసైన్డ్ భూములను అక్రమంగా చేజిక్కించుకున్నారు. వెబ్‌ల్యాండ్ రికార్డులను తారుమారు చేసి, వేల సంఖ్యలో నకిలీ =ా=, 1-దీ లు, పట్టాదారు పాస్‌పుస్తకాలు సృష్టించారు. స్థానిక రెవెన్యూ అధికారులు, వీఆర్వోలు గత పాలకుల ఒత్తిళ్లతో విద్యానాథరెడ్డికి పూర్తిగా సహకరించారు. శ్రీకాళహస్తి నుంచి బీఎన్ కండ్రిగకు వచ్చిన వీఆర్వో బాలమురళీకృష్ణ రెవెన్యూ వ్యవస్థను తన గుప్పిట్లో పెట్టుకుని, ఇప్పటికీ పాత పద్ధతిలోనే అక్రమార్కులకు వత్తాసు పలుకుతున్నారు. కావున వారిపై చర్యలు తీసుకోని ప్రభుత్వం భూములను కాపాడాలని నేతలు పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖ మంత్రి టి.జి. భరత్, ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ ఛైర్మన్ మన్నవ మోహన కృష్ణలకు అర్జీ ఇచ్చి అభ్యర్థించారు.

ఎన్టీఆర్ జిల్లా చందర్లపాడు మండలం పాటెంపాడు గ్రామానికి సీతారామయ్య గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ..1977 జూలై 23న జరిగిన కుటుంబ ఒప్పందం ప్రకారం తన తండ్రి గుత్తా నరసింహారావు గారికి వాటాగా వచ్చిన 3.52 సెంట్ల భూమిని సర్వే నంబర్: 34లో, ఆయన 2014 అక్టోబర్ 10న రిజిస్ట్రేషన్ ద్వారా తన పేరున బదిలీ చేశారు. అప్పటి నుంచి ఆ భూమి తమ స్వాధీనంలోనే ఉంది. ఇటీవల పక్క హద్దుదారుడైన గుత్తా శ్రీనివాసరావు ఉద్దేశపూర్వకంగా భూమి హద్దు రాళ్లను తొలగించి, రికార్డులను అడ్డుపెట్టుకుని ఎక్కువ భూమిని కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ సమస్యపై ఇప్పటికే జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మార్వో, ఎస్ఐలకు ఫిర్యాదు చేసిన తనకు న్యాయం జరగలేదు. కావున వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరాడు.వైఎస్సార్ కడప జిల్లా కొండాపురం మండలం బెడుదూరు గ్రామానికి చెందిన సత్యనారాయణరెడ్డి గ్రీవెన్స్ లో అర్జీ విజ్ఞప్తి చేస్తూ..తమ గ్రామంలో సర్వే నంబర్లు 335, 336, 482/6లలో తను, కొత్తపల్లి గంగప్ప ఉమ్మడిగా వ్యవసాయం చేసుకుంటున్నాం. సుమారు రెండెకరాల విస్తీర్ణంలో మూడేళ్ల క్రితం నాటిన మామిడి చెట్లను, చుట్టూ వేసిన ఫెన్సింగ్ కంచెను, ఇనుప గేటును, సాగునీటి పైప్‌లైన్లను అదే గ్రామానికి చెందిన దంపెట్ల నారాయణస్వామి ట్రాక్టర్‌తో దున్ని పూర్తిగా నాశనం చేశారు. స్థానికంగా ఉన్న కొందరు రాజకీయ పెద్దల అండదండలతో దంపెట్ల నారాయణస్వామి ఈ భూములకు సంబంధించి నకిలీ డీకేటీ పట్టాలు సృష్టించి, భూమిని ఆక్రమించుకోవాలని చూస్తున్నారు. ఈ అకృత్యంపై ఇప్పటికే కడప జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేసినప్పటికీ, స్థానిక పలుకుబడి కారణంగా నిందితుడిపై ఇప్పటివరకు ఎటువంటి చట్టపరమైన చర్యలు తీసుకోలేదు. కావున వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరాడు.కర్నూలు జిల్లా కృష్ణగిరి మండలం పందిపల్లె గ్రామానికి చెందిన బొమ్మర చంద్రశేఖర్ గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ..తమ కుటుంబంలో మొత్తం నలుగురు మగ సంతానం ఉన్నాం. ప్రస్తుతం తల్లిదండ్రులు ఇద్దరూ మరణించారు. వేపముల గ్రామ పరిధిలో తమ కుటుంబానికి వారసత్వంగా వచ్చిన పూర్వీకుల భూములు ఉన్నాయి, నిబంధనల ప్రకారం నలుగురుకి ఆస్తి సమానంగా పంచాల్సి ఉంది. తనకు చదువు రాకపోవడం, అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని మిగిలిన ముగ్గురు అన్నలైన బొమ్మర పరమయ్య, బొమ్మర నీలకంఠేశ్వరయ్య, బొమ్మర గోవిందరాజులు కుట్ర పన్నారు. తండ్రి అనారోగ్యంతో, సరైన స్పృహ లేని సమయంలో కర్నూలులో ఆయన పేరిట ఉన్న వ్యవసాయ భూములను ముగ్గురు అన్నలు తమ పేర్లపై అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. నంద్యాల టౌన్‌లో ఉన్న ఉమ్మడి స్థలాన్ని సుమారు రూ. 60,80,000 (అరవై లక్షల ఎనభై వేల రూపాయలకు) అమ్ముకుని ఆ మొత్తాన్ని పూర్తిగా ఆ ముగ్గురు అన్నలే పంచుకున్నారు. తనకు నయాపైసా వాటా ఇవ్వకుండా మోసం చేశారు. కావున వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరాడు.

గుంటూరు జిల్లా తెనాలికి చెందిన పగడాల కాశయ్య గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ..1987లో సర్వే నెం. 623/1లోని 70 సెంట్ల వెంచర్‌లో పఠాన్ హమీద్ ఖాన్, అహ్మద్ ఖాన్, షబ్బీర్ ఖాన్, మహబూబ్ ఖాన్‌ల నుంచి తాను 132.5 చ.గజాలు (దస్తావేజు నెం: 2392/1987), తన సోదరుడు దివంగత చిన కాశయ్య 142.5 చ.గజాలు (దస్తావేజు నెం: 2039/1987) కొనుగోలు చేశాం. అయితే 2007 తర్వాత సదరు వ్యక్తులు బినామీలను అడ్డుపెట్టుకుని దొంగ రిజిస్ట్రేషన్లు సృష్టించి తమ స్థలాలను కబ్జా చేశారు. వెంచర్ నిర్వాహకులు తమ భూమినే కాకుండా, పక్కనే ఉన్న మరో ఎకరం భూమిని, జలవనరుల శాఖకు చెందిన పంట కాలువను సైతం ఆక్రమించి ప్లాట్లుగా విభజించి అక్రమంగా విక్రయించారు. గత 20 ఏళ్లుగా రెవెన్యూ, రిజిస్ట్రేషన్, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులకు ఆధారాలతో సహా ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవడం లేదు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సమర్పించిన ఫిర్యాదులను పరిష్కరించకుండానే సంతకాలు తీసుకుని కోర్టుకు వెళ్లాలంటూ అధికారులు తప్పించుకుంటున్నారు. కావున వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరాడు.

నంద్యాల జిల్లా రుద్రవరం మండలం ముత్యాలపాడుకు చెందిన పి. హనుమంతరెడ్డి గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ..2017లో ఆర్. శివరాముడు రుద్రవరం ఎమ్మార్వోగా పనిచేస్తున్న సమయంలో తన భార్యతో కలిసి పని నిమిత్తం కార్యాలయానికి వెళ్లగా, తనను జిరాక్స్ కోసం బయటకు పంపి సదరు అధికారి మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారు. దీనిపై 05-06-2017న రుద్రవరం పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ (ఖీ×= చీశీ: 44/2017) నమోదైంది. ఈ కేసు ప్రస్తుతం ఆళ్లగడ్డ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో విచారణ దశలో ఉంది. ఈ కేసును కొట్టివేయాలని శివరాముడు 2019లో హైకోర్టును ఆశ్రయించగా, న్యాయస్థానం ఆ పిటిషన్‌ను తిరస్కరించింది. అనంతరం 2024లో ఆళ్లగడ్డ కోర్టులో దాఖలు చేసిన డిశ్చార్జ్ పిటిషన్ కూడా కొట్టివేయబడింది. దీనిపై ఆయన తిరిగి హైకోర్టులో వేసిన రివిజన్ పిటిషన్ ప్రస్తుతం పెండింగ్‌లో ఉంది. ఇంతటి తీవ్రమైన మహిళా వేధింపుల కేసు కోర్టు విచారణలో ఉండగానే, ఆయనకు ఎమ్మార్వో స్థాయి నుంచి డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి కల్పించి రాజమహేంద్రవరం ఆర్డీవోగా నియమించడం అన్యాయం. ఉన్నత పదవిలో ఉంటే అధికార బలం ఉపయోగించి సాక్షులను ప్రభావితం చేయడం, బెదిరించడం లేదా రికార్డులను తారుమారు చేసే అవకాశం ఉంది. కావున కోర్టు విచారణ పూర్తయ్యే వరకు ఆర్డీవో పదోన్నతిని రద్దు చేయాలని కోరాడు.

కడపకు చెందిన రమాదేవి గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ..గత పది రోజులుగా శివ, కల్పన అనే వ్యక్తులు ప్రతిరోజూ తమ ఇంటికి వచ్చి తీవ్ర అసభ్యకరమైన పదజాలంతో దూషిస్తున్నారు. మేనత్త అని కూడా చూడకుండా శివ దారుణంగా ప్రవర్తిస్తున్నాడు. ముఖంపై దిండు వేసి ఊపిరాడకుండా చేసి చంపేస్తామని, తల్లికూతుళ్లిద్దరినీ వదిలిపెట్టబోమని బెదిరింపులకు పాల్పడుతున్నాడు. వివాహమై వేరే ప్రాంతంలో నివసిస్తున్న తన కుమార్తె ఇంటికి సైతం వెళ్లి భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. తమపైనే దౌర్జన్యం చేయడమే కాకుండా, తిరిగి తమపైనే పోలీసులకు తప్పుడు ఫిర్యాదులు ఇస్తూ వేధిస్తున్నారు. కావున వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం చందాపురం గ్రామానికి చెందిన మందడపు శ్రీనివాసమూర్తి గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ..తమ గ్రామంలో సర్వే నంబర్ 601లో గల 75 సెంట్ల భూమి కుటుంబ భాగపంపిణీ ద్వారా తన తండ్రి మందడపు వెంకటనారాయణకు వచ్చింది. గతంలో బాబాయి మందడపు వెంకటేశ్వరరావు గట్లు చెడగొట్టడంతో, మండల సర్వేయర్ ద్వారా భూమిని కొలతలు వేయించి సరిహద్దు రాళ్లను పాతించాం. దీనికి సంబంధించి 13-03-2026న సర్వేయర్ అధికారిక ధ్రువీకరణ పత్రం కూడా జారీ చేశారు. ఇటీవల బాబాయి వెంకటేశ్వరరావు ఉద్దేశపూర్వకంగా తూర్పు గట్టున ఉన్న ప్రభుత్వ సర్వే రాయిని పీకివేసి, ఆ 75 సెంట్ల భూమిని తన పొలంలో కలుపుకుని దౌర్జన్యంగా సాగు చేస్తున్నారు. అధికారికంగా వేసిన సరిహద్దు రాళ్లను ఎందుకు తొలగించావని ప్రశ్నించినందుకు, తనపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ చంపేస్తామని బెదిరించారు. 'దిక్కున్న చోట చెప్పుకో' అంటూ అక్కడి నుంచి గెంటేశారు. కావున వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరాడు.

వైఎస్సార్ కడప జిల్లా బ్రహ్మంగారిమఠం మండలం గొల్లపల్లె గ్రామానికి చెందిన కొంచంరెడ్డి లక్ష్మిరెడ్డి గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ..తన యాజమాన్యంలోని లారీని (ఌూ 39 ర 1166) తేదీ 10-03-2026న మదుగులూరుకు చెందిన శ్రీనివాసులు కుమారుడు శేఖర్‌కు విక్రయ ఒప్పందంపై అప్పగించాం. వాహనానికి సంబంధించిన టైర్లు, రిపేర్లు, ఇన్సూరెన్స్, ట్రాఫిక్ చలానాలు, పెండింగ్ కేసులు, ఫైనాన్స్ వాయిదాల పూర్తి బాధ్యతను కొనుగోలుదారుడే భరించాలని పరస్పరం అంగీకరించారు. కొనుగోలుదారు శేఖర్ 6 వాయిదాలుచెల్లించి, ఆ తర్వాత 3 వాయిదాలు ఎగవేశారు. వాహన నిర్వహణ, పత్రాల పునరుద్ధరణ బాధ్యతలను విస్మరించడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొని తేదీ 13-08-2026న ఆ లారీని తిరిగి తన ఆధీనంలోకి తెచ్చుకున్నాను. ఈ వ్యవహారంలో కొనుగోలుదారుతో పాటు రవాణా బాధ్యతలు చూసిన వ్యక్తుల వ్యవహారశైలిపై విచారణ జరిపించి, తనకు ఆర్థికంగా, న్యాయపరంగా నష్టం కలగకుండా తగిన పరిష్కారం చూపాలని కోరాడు.

వీటితో పాటు పలువురు పింఛన్, రేషన్, ఇళ్ల నిర్మాణాల సమస్యలపై అర్జీలు ఇచ్చి పరిష్కరించాలని కోరగా.. మరికొందరు ఉద్యోగాల కోసం రెస్యూమ్ లు ఇచ్చారు. అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నాం ఆర్థికతోడ్పాటు కల్పించాలని మరికొందరు అభ్యర్థనలు అందించారు.

# ఆటోలకు విద్యుత్ బాట

– పాత పెట్రోల్, డీజిల్ ఆటోల మార్పునకు తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం – 18,766 ఆటోలకు ఎలక్ట్రిక్ రూపం.. రూ.200 కోట్ల కేటాయింపు

**హైదరాబాద్, ఆగస్టు 27: (విజన్ ఆంధ్ర)**

రాష్ట్రంలోని ఆటోరిక్షా డ్రైవర్లకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పెట్రోల్, డీజిల్‌తో నడిచే పాత ఆటోలను ఎలక్ట్రిక్ ఆటోలుగా మార్చేందుకు 'తెలంగాణ ఆటోరిక్షా ఎలక్ట్రిక్ కన్వర్షన్ స్కీమ్2026'ను అమలు చేయాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను ప్రభుత్వం జారీ చేసింది.ఈ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 18,766 పెట్రోల్, డీజిల్ ఆటోలను ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చేందుకు చర్యలు చేపట్టనున్నారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.200 కోట్ల నిధులను కేటాయించింది. ఇంధన ధరలు, వాహనాల నిర్వహణ ఖర్చులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆటో డ్రైవర్లకు ఈ పథకం కొంత ఆర్థిక ఉపశమనం కలిగించే అవకాశం ఉంది.పెట్రోల్, డీజిల్ వాహనాల స్థానంలో ఎలక్ట్రిక్ ఆటోల వినియోగాన్ని పెంచడం ద్వారా కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు ఇంధన వ్యయాన్ని తగ్గించడమే పథకం ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం పేర్కొంది. ఎలక్ట్రిక్ వాహనాల నిర్వహణ వ్యయం సంప్రదాయ ఇంధన వాహనాలతో పోలిస్తే తక్కువగా ఉండే అవకాశం ఉండటంతో ఆటో డ్రైవర్లకు దీర్ఘకాలికంగా ప్రయోజనం చేకూరనుంది.రూ.200 కోట్ల నిధులతో 18,766 ఆటోలను విద్యుత్ వాహనాలుగా మార్చే ప్రక్రియను ప్రభుత్వం ఏ విధంగా అమలు చేస్తుందన్న దానిపై ఆటో డ్రైవర్లలో ఆసక్తి నెలకొంది.

# విశ్రాంత ఉద్యోగులకు మరియు సర్వీసు లో చనిపోయిన ఉద్యోగుల కుటుంబాలకు గ్రూప్ ఇన్సూరెన్సు ఇవ్వండి



**కదిరి, ఆగస్టు 27((విజన్ ఆంధ్ర) విలేకరి)**
శ్రీ సత్యసాయి జిల్లా కదిరి డిపో నందు తేది: 1.1.2022 నుండి తేది: 31.12.2025 వరకు సర్వీసులో పదవీ విరమణ పొందిన మరియు సర్వీసు లో చనిపోయిన ఉద్యోగుల కుటుంబాలకు గ్రూప్ ఇన్సూరెన్సు సెటిల్ మెంట్స్ చేయమని రాష్ట్ర ప్రభుత్వం జి.వో నెంబరు: 54, తేది: 13.7.2026 నాడున విడుదల చేసినదని, కావున ఆ మేరకు తమకు జి.ఐ.ఎస్ సెటిల్ చేయాలని కదిరి డిపో విశ్రాంత ఉద్యోగుల సంఘము నాయకులు కదిరి డిపో మేనేజరు జి.రమణయ్య కు గురువారం చాంబర్ లో కలసి వినతి పత్రము సమర్పించినారు. సర్వీసులో చనిపోయిన ఉద్యోగి భార్య కు ఒక్కొక్కరికి రూ.30,000.00 వస్తాయని తెలిపారు. కదిరి డిపో నందు తేది: 1.1.2022 నుండి ఇప్పటివరకు 100 మంది పదవీ విరమణ చెందివున్నారని, ఫించన్ సదుపాయం లేని, విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగుల జి.ఐ.ఎస్ బకాయిలు వెంటనే ట్రెజరీ కి అప్ లోడు చేసి, చెల్లించాలని కోరారు. ఈరోజు కదిరి డిపో మేనేజరు గారికి రిటైర్డు ఉద్యోగుల సంఘము కార్యదర్శి ఎస్.సి.ఎం.బాష, నాయకులు కాళసముద్రం క్రిష్ణయ్య, రామ్మోహన్ రెడ్డి, ఓబులేసు తదితరులు కలసి వినతి పత్రము సమర్పించినారు.

# నేపాల్ వరదల్లో ఉన్న సత్యసాయి జిల్లావాసులకు హెల్ప్‌లైన్

## కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నెంబర్ 08555-289039

**పుట్టపర్తి ఆగస్టు 27((విజన్ ఆంధ్ర) విలేకరి)**
శ్రీ సత్యసాయి జిల్లాకు చెందిన ప్రజలు ఎవరైనా నేపాల్ వరదలలో చిక్కుకున్నట్లయితే వెంటనే జిల్లా కలెక్టరేట్ కమాండ్ కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబరు 08555-289039 నకు సమాచారం అందించాలని జిల్లా యంత్రాంగం తెలియజేసింది.బాధితుల వివరాలు అందించినట్లయితే, సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ వారిని సురక్షితంగా సొంత ప్రాంతాలకు తీసుకొచ్చేందుకు జిల్లా యంత్రాంగం తగిన చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు.

# న్యాయవాదులకు రక్షణ చట్టం తక్షణమే అమలు పరచాలి:

## ప్రభుత్వాన్ని కోరిన శ్రీకాకుళం బార్ అసోసియేషన్ అధ్యక్షులు కూనా. రాజారావు




**శ్రీకాకుళం, ఆగస్టు 27((విజన్ ఆంధ్ర) ప్రతినిధి)**
శ్రీకాకుళం పట్టణంలో గల జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు అయిన కూనా. రాజారావు ఆధ్వర్యంలో గురువారం న్యాయవాదులకు రక్షణ చట్టం తక్షణమే అమలు పరచాలి అని పట్టణ బార్ అసోసియేషన్ సభ్యులు, అధిక సంఖ్యలో జూనియర్ న్యాయవాదులు ర్యాలీగా వెళ్లి అంబేద్కర్ జంక్షన్ వద్ద పత్రికా మీడియా మిత్రులతో మాట్లాడారు, అనంతరము బార్ అసోసియేషన్ హాల్లో ప్రెసిడెంట్ కూనా. రాజారావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్లో వివిధ కోర్టులో చేస్తున్న న్యాయవాదులపై భౌతిక దాడులు చేస్తున్నారని దీనిని మేము తీవ్రంగా ఖండిస్తున్నామని ఈ సందర్భంగా తెలిపారు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వము తక్షణమే న్యాయవాదులకు రక్షణ చట్టం అమలు పరచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు, ఈ యొక్క కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా బార్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ చిట్టి. సూర్యనారాయణ , శ్రీకాకుళం పట్టణ బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ దండు. సరళ కుమారి, జాయింట్ సెక్రెటరీ డొంకన. ఈశ్వరరావు, ట్రెజరర్ సిరిపురం .సుజాత, స్పోర్ట్స్ సెక్రటరీ గేదెల. ఇంద్రప్రసాద్, లైబ్రరీ సెక్రెటరీ కె. శంకర్రావు, మహిళ రిప్రజెంటేటివ్ జి. సత్య భామ సీనియర్ , జూనియర్ న్యాయవాదులు అయినా జల్లు. తిరుపతిరావు, రామన్. దయాల్, పి. మురళీకృష్ణ, బోయిడి .మురళీకృష్ణ, సనపల. హరి , ఏ. ఉమామహేశ్వరరావు, పి. అంజనీ కుమార్ ,ఫిలిప్స్, మూగి. గురుమూర్తి, చలపతిరావు, మరి కొంతమంది న్యాయవాదులు ఈ యొక్క కార్యక్రమంలో పాల్గొన్నారు.

# కదిరి పట్టణంలోని ప్రధాన కూడలిలో ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేయాలి. సిపిఎం



**కదిరి, ఆగస్టు 27((విజన్ ఆంధ్ర) విలేకరి)**
శ్రీ సత్యసాయి జిల్లా కదిరి పట్టణం లో ప్రధాన కూడలిలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని గురువారం సిపిఎం పార్టీ కదిరి పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు కు వినతి పత్రం అందించారు .ఈసందర్భంగా సిపిఎం నాయకులు బాబ్ జాన్, ముస్తాక్ మాట్లాడుతూకదిరి పట్టణంలో నిత్యం వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ముఖ్యంగా కదిరి మీదుగా జాతీయ రహదారి (నేషనల్ హైవే) వెళ్లడం వల్ల భారీ వాహనాలు, బస్సులు, కార్లు, ద్విచక్ర వాహనాలు అధికంగా ప్రయాణిస్తున్నాయి. దీనివల్ల ప్రధాన కూడళ్ల వద్ద ట్రాఫిక్ రద్దీ పెరిగి, పాదచారులు, విద్యార్థులు మరియు వాహనదారులు తీవ్ర ఇబ్బందులుఎదుర్కొంటున్నారన్నారు.ప్రమాదాలు జరిగే అవకాశం కూడా అధికంగా ఉందన్నారు.అందువల్ల ప్రజల భద్రత దృష్ట్యా కదిరి పట్టణంలోని ప్రధాన కూడలిలో తక్షణమే ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేయించి, అవసరమైన ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టవలసిందిగా సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పట్టణ సిఐ కి వినతి పత్రం ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు రామ్మోహన్, ఆంజనేయులు,నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# అన్నమయ్య జాతీయ సదస్సులో డాక్టర్ బత్తుల అశోక్ కుమార్



**పాకాల ,ఆగస్టు 27((విజన్ ఆంధ్ర) ప్రతినిధి)**
తిరుమల తిరుపతి దేవస్థానం అన్నమాచార్య ప్రాజెక్టు, పాకాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగుశాఖ సంయుక్త ఆధ్వర్యంలో "అన్నమయ్య సంకీర్తనలు – శ్రీ వెంకటేశ్వర వైభవం" అన్న అంశంపై ఆగస్టు 27, 28 తేదీలలో జాతీయ సదస్సును నిర్వహిస్తున్నారు. మొదటిరోజు రెండవ సదస్సులో శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం తెలుగు శాఖ పోస్ట్ డాక్టరల్ ఫెలో డాక్టర్ బత్తుల అశోక్ కుమార్ పాల్గొని "శ్రీ వేంకటేశ్వరుని పై అన్నమయ్య మధుర భక్తి సంకీర్తనావళి" అనే అంశం పై సమర్పణ చేశారు. ఇందులో శ్రీవెంకటేశ్వర స్వామిపై అచంచల భక్తి భావంతో అన్నమయ్య స్వరపరిచిన సంకీర్తనలు విశిష్టమైనవని, వాటిని భావితరాలకు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆ దిశగా అన్నమాచార్య ప్రాజెక్టు విశేషమైన సేవలు చేస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా సెమినార్ కన్వీనర్ డాక్టర్ కే ఈశ్వర్ బాబు, నిర్వాహకులు కలిసి డాక్టర్ బత్తుల అశోక్ కుమార్ కు శాలువా కప్పి శ్రీ వేంకటేశ్వర స్వామి ప్రసాదాలు అందజేసి ఘనంగా సన్మానించారు.





**పొందూరు, ఆగస్టు 27((విజన్ ఆంధ్ర) ప్రతినిధి)**
పొందూరు పట్టణంలో శ్రీ రామలింగేశ్వర ఆలయ ప్రాంగణంలో వాసవి గ్లోబల్ స్పిరిచువల్ కౌన్సిల్ గ్లోబల్ ఫౌండర్ చైర్మన్ బండారు జై ప్రతాప్ కుమార్ ఆధ్వర్యంలో శ్రావణమాసం పర్వదినం సందర్భంగా సూర్య భగవానుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం 108 కోట్ల శ్రీ సూర్యనారాయణ స్వామి నామ పారాయణ జప యజ్ఞానికి అంకురార్పణ చేశారు ప్రాంగణం అంతా సూర్యనారాయణ స్వామి నామ స్మరణ మారుమోగింది ఈ మహా యజ్ఞాన్ని ప్రారంభ విశిష్టతను వీజీస్సీ చైర్మన్ మీడియాకు వివరిస్తూ ప్రపంచంలోని ప్రతి మనిషిలో దైవత్వాన్ని ప్రతి హృదయంలో మానవత్వాన్ని ప్రతి కుటుంబంలో శాంతిని ప్రతి సమాజంలో సౌభ్రాతృత్వాన్ని ప్రపంచమంతటా విశ్వశాంతిని పెంపొందించాలని విశాల దృక్పథమే ఈ కార్యక్రమం లక్ష్యమని ఒక మహా సంకల్పం ఒక మహా మహా జపం ఒక విశ్వమంగళ ప్రయాణం సూర్యుడు ప్రతిరోజు ఉదయిస్తాడు ఎవరు ప్రార్థించినా ఎవరు ప్రార్థించకపోయినా ఏ దేశంలో ఉన్నా ఏ భాష మాట్లాడిన ఏ సంస్కృతికి చెందిన వారైనా సూర్యుని వెలుగు అందరినీ సమానంగా తాకుతుంది ఆ సమానత్వమే మనకు ఒక గొప్ప సందేశాన్ని అందిస్తుంది అన్నారు మనిషి మనిషిని ప్రేమించాలి ఒకరు ఒకరు గౌరవించాలి ప్రకృతిని కాపాడాలి ధర్మబద్ధంగా జీవించాలి సమాజానికి సేవ చేయాలి ప్రపంచ శాంతి కోసం ప్రార్థించాలి మన సనాతన సంప్రదాయం ప్రకృతిని దైవ స్వరూపంగా గౌరవించింది





అందులో సూర్య ఆరాధనకు ఒక విశిష్టమైన స్థానం ఉంది సూర్యుడు మనకు ప్రత్యక్షంగా దర్శనమిచ్చే ప్రకాశ స్వరూపం ఆయన కాంతి మనకు వెలుగును గుర్తుచేస్తుంది ఆయన ఉదయం మనకు నూతన ఆరంభాన్ని గుర్తుచేస్తుంది ఆయన సాక్షిగా మన జీవితం ధర్మం నియమం సత్యం భక్తి సేవ మార్గంలో సాగాలని మనం సంకల్పిస్తున్నాం. ఈ మహోన్నత ఆధ్యాత్మిక భావనను ప్రపంచవ్యాప్తంగా ప్రజల హృదయాలకు చేరువు చేయాలనే పవిత్ర సంకల్పంతో వాసవి గ్లోబల్ స్పిరిచువల్ కౌన్సిల్ ఆధ్యాత్మిక మరియు విశ్వశాంతి కార్యక్రమానికి ప్రారంభం చేస్తుంది ప్రతి ఒక్కలు శ్రీ సూర్యనారాయణ స్వామి అష్టోత్తర శత 108 కోట్ల నామ పారాయణం జప మూలమంత్రాన్ని గురువులు శేఖర్ శర్మ శ్రీ, మువ్వల ప్రసాద్ ఓం ఘృణిః సూర్య ఆదిత్యోమ్ వ మంత్ర విధానాన్ని ఏ విధంగా జపం చేయాలి సూచన చేశారు ఈ కార్యక్రమం గోడపత్రికను , వెబ్సైట్ ను మాజీ సభాపతి తమ్మినేని సీతారాం, ఆముదాలవలస శాసనసభ్యులు సతీమణి కూన ప్రమీల, జిల్లా జడ్పీ చైర్పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ , కేంద్ర మాజీ మంత్రివర్యులు కిల్లి కృపారాణి, రాష్ట్ర వైయస్సార్సీపి కార్యదర్శి బొడ్డేపల్లి పద్మజ, బిగ్ బాస్ కంటెస్టెంట్ దువ్వాడ మాదిరి బిజెపి జిల్లా మహిళా అధ్యక్షురాలు సింధూర, నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్ అనకాపల్లి విజయలక్ష్మి, సనపల సత్యవతి, పప్పల రమణమూర్తి పప్పల రమేష్, టిడిపి మండల అధ్యక్షుడు చిగురుపల్లి రామ్మోహన్, ఎంపీటీసీ బాడన హరికగిరి, ఎస్.ఎస్.ఎన్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సూరా శ్రీనివాసరావు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు సనపల అన్నాజీ రావు, పొందూరు మాజీ ఉప సర్పంచ్ అనకాపల్లి గోవిందరావు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# 'ఖేలో ఇండియా సంవాద్'లో ఎమ్మెల్యే కందికుంట

## క్రీడలతో యువతలో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయి : కందికుంట వెంకటప్రసాద్







**కదిరి, ఆగస్టు 27 ((విజన్ ఆంధ్ర) ప్రత్యేక ప్రతినిధి):** జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని 'మేరా యువ భారత్', యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఖేలో ఇండియా సంవాద్ ఖేల్ కీ బాత్ పీఎం కే సాత్' కార్యక్రమం కదిరి పట్టణంలోని ఎస్టీఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో గురువారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కదిరి నియోజకవర్గ శాసనసభ్యుడు కందికుంట వెంకటప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. శ్రీ సత్యసాయి జిల్లాలో ఈ కార్యక్రమాన్ని కదిరి ఎస్టీఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో ప్రత్యేకంగా నిర్వహించడం విశేషంగా నిలిచింది. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌గా చేసిన ప్రసంగాన్ని విద్యార్థులు, యువత ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. అనంతరం స్థానిక క్రీడాకారులతో ముఖాముఖి చర్చ నిర్వహించారు. క్రీడా మౌలిక వసతుల అభివృద్ధి, ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించడం, 2036 ఒలింపిక్స్‌ను దృష్టిలో ఉంచుకుని క్రీడాకారులను తీర్చిదిద్దడం వంటి అంశాలపై చర్చించారు. క్రీడల ద్వారా యువతలో నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, పట్టుదల, జట్టు స్ఫూర్తిని పెంపొందించాల్సిన అవసరాన్ని వివరించారు. వికసిత్ భారత్ ఏ2047 లక్ష్య సాధనలో యువత పాత్ర, నైపుణ్యాభివృద్ధి, డిజిటల్ మరియు ఆర్థిక పరిజ్ఞానం, స్వచ్ఛంద సేవా కార్యక్రమాల్లో యువత భాగస్వామ్యం, 'మేరా యువ భారత్' ద్వారా యువతకు అందుతున్న అవకాశాలపై కూడా కార్యక్రమంలో చర్చ జరిగింది.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మాట్లాడుతూ.. క్రీడలు కేవలం శారీరక దారుఢ్యానికే కాకుండా క్రమశిక్షణ, పట్టుదల, నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు దోహదపడతాయని అన్నారు. కదిరి నియోజకవర్గంలోని యువ క్రీడాకారులు తమ ప్రతిభను మరింతగా మెరుగుపరుచుకుని రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ప్రధాని నరేంద్ర మోదీ క్రీడలకు, క్రీడాకారులకు అందిస్తున్న ప్రోత్సాహంతో దేశంలో క్రీడా రంగం మరింత బలోపేతమవుతోందని కందికుంట పేర్కొన్నారు. యువత తమకు అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని వికసిత్ భారత్ ఏ2047 నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సలీం భాష, అధ్యాపకులు సుందర్, అలీతో పాటు అధ్యాపక బృందం, విద్యార్థులు, స్థానిక క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# "ఇండస్ వివా" కు ఎఫ్ఐ ఇండియా ప్రతిష్టాత్మక అవార్డు

## ముంబైలో స్వీకరించిన కంపెనీ డైరెక్టర్ మండలనేని సుబ్రహ్మణ్యం

**ముంబై, ఆగస్టు 27((విజన్ ఆంధ్ర) ప్రత్యేక ప్రతినిధి)**
మెరుగైన ఆరోగ్య ఆహార ఉత్పత్తుల తయారీ రంగంలో అసాధారణమైన లక్ష్యాలను సాధించి, నాణ్యమైన ప్రోడక్ట్ లను మార్కెట్లో విక్రయిస్తున్న ఇండస్ వివా హెల్త్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతిష్టాత్మకమైన ఎఫ్ఐ ఇండియా అవార్డును కైవసం చేసుకుంది. బుధవారం రాత్రి ముంబైలో జరిగిన ఎఫ్ఐ ఇండియా ఫోర్త్ ఎడిషన్ అవార్డుల ప్రదాన కార్యక్రమంలో ఇండస్ వివా హెల్త్ సైన్సెస్ డైరెక్టర్ మండలనేని సుబ్రహ్మణ్యం అవార్డును అందుకున్నారు. బెంగళూరుకు చెందిన ఇండస్ వివా హెల్త్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ మెరుగైన జీవనానికి కట్టుబడి నాణ్యమైన ఉత్పత్తులను అందించడానికి అత్యుత్తమ ప్రమాణాలను పాటిస్తోంది. ఐ పల్స్, ఐ కేర్, ఐ కాఫీ, ఐ గ్లో, ఐ స్లిమ్, ఐ గైన్ పేరిట ఆహార ఉత్పత్తులను మార్కెట్లో విక్రయిస్తోంది. అకాయ్ బెర్రీ ప్రధానంగా ఉండడంతో పాటు 15 పండ్లతో కూడిన ఐ పల్స్ ను ఫ్రూట్ డ్రింక్ గా అమ్ముతారు. ఇమ్యూనిటీ బూస్టింగ్ కు, ఎనర్జీ కోసం ఈ పానీయం



ఉపకరిస్తుందని చెబుతారు.
ఐ స్లిమ్ బరువు తగ్గడానికి, ఐ గ్లో చర్మ సౌందర్యానికి, ఐ గైన్ బరువు పెరగడానికి అని చెప్పే ప్రోడక్ట్ లకు మార్కెట్లో మంచి గిరాకీ ఉంది. (డయాబెటిస్) మధుమేహం ఉన్నవారికి అని చెప్పే ఐ కాఫీ బ్లాక్ తో పాటు ఐ కాఫీ క్రీమర్ కు వినియోగదారుల నుండి మంచి ఆదరణ లభిస్తోంది. ఇండస్ వివా హెల్త్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ అందించే ఈ




ఉత్పత్తులను ఆహార సప్లిమెంట్లుగా మాత్రమే కంపెనీ చెబుతుంది. పుష్కర కాలంగా ఉన్నత ప్రమాణాలను పాటిస్తూ మెరుగైన జీవనానికి దోహదపడేలా అంకితభావంతో ఉత్పత్తులు తయారు చేసే ఇండస్ వివా హెల్త్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ కు ప్రతిష్టాత్మకమైన ఎఫ్ఐ ఇండియా అవార్డు దక్కడం పట్ల వ్యాపార, వాణిజ్య వర్గాల తో పాటు వినియోగదారుల్లో కూడా హర్షం వ్యక్తం అవుతోంది.

# గూడూరులో నిరుపేదలకు 18 రకాల పలసరుకుల పంపిణీ



## ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉదారత చాటుకున్న దాత పొణకా మల్లికార్జున రెడ్డి

**గూడూరు, ఆగస్టు 27((విజన్ ఆంధ్ర) ప్రతినిధి)**
నెల్లూరు జిల్లా గూడూరు పట్టణంలో గురువారం బాలాజీ నగర్ నందు ప్రగతి సేవా సంస్థ కార్యాలయంలో నందు నిరుపేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కీర్తిశేషులు పొణకా ఆదిశేషారెడ్డి జ్ఞాపకార్థం, వారి కుమారుడు పొణకా మల్లికార్జున రెడ్డి పూర్తి సహకారంతో 15 నిరుపేద కుటుంబాలకు 18 రకాల పలసరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రగతి సేవా సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ప్రతి నెలా క్రమం తప్పకుండా పేద కుటుంబాలను ఆదుకోవడం తమ సంస్థ ధ్యేయమని పేర్కొన్నారు. తండ్రి జ్ఞాపకార్థం ఈ బృహత్తర కార్యక్రమానికి సహకారం అందించిన పొణకా మల్లికార్జున రెడ్డి కి ఆయన ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ముఖ్య అతిథి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ రామ్మోహన్ మాట్లాడుతూ.. పేదలకు సేవ చేయడంలోనే ఆధ్యాత్మిక తృప్తి ఉందన్నారు. కష్టాల్లో ఉన్నవారిని ఆదుకోవడానికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని, ప్రగతి సేవా సంస్థ నిర్వహిస్తున్న ఇలాంటి కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రగతి సేవా సంస్థ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నేతన్న సేవలో పథకంపై మంత్రి సత్యకుమార్ యాదవ్ సమీక్ష...

- అర్హుడికి సాయం అందకపోతే బాధ్యులెవరు? అధికారులను ప్రశ్నించిన మంత్రి సత్యకుమార్ యాదవ్
- లబ్ధిదారుల వివరాలపై ఆరా.. అర్హులందరికీ పథకం అందేలా మంత్రి దిశానిర్దేశం
- నేతన్న సేవలో నిర్లక్ష్యానికి చోటు లేదు.. అధికారులకు మంత్రి సత్యకుమార్ స్పష్టమైన ఆదేశం
- మొదటి విడతలో 71,536 మంది నేతన్నలకు రూ.25 వేల ఆర్థిక సాయం
- కొత్తగా వచ్చిన 36,617 దరఖాస్తులపై ఇంటింటి సర్వే.. ఈ నెలాఖరుకు అర్హుల గుర్తింపు
- మిగిలిన అర్హులకు త్వరలో రెండో విడతలో రూ.25 వేల సాయం
- నేతన్న సంక్షేమంలో రాజీ లేదు.. అర్హుడైన ప్రతి ఒక్కరికీ రూ.25 వేల సాయం అందిస్తాం..నేతన్నల సంక్షేమంపై ప్రభుత్వం కట్టుబడి ఉంది.
- అర్హుడైన ఒక్క నేతన్నకు కూడా అన్యాయం జరగకూడదు.
- అర్హత ఉన్న ప్రతి నేతన్నకూ పథకం వర్తింప చేస్తాం.. ఎవరూ ఆందోళన చెందొద్దు...
- మంత్రి సత్యకుమార్ యాదవ్



**ధర్మవరం, ఆగస్టు 27((విజన్ ఆంధ్ర) ప్రత్యేక ప్రతినిధి)**

నేతన్నల సంక్షేమం, ఆర్థిక భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య శాఖమంత్రి , ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు. అర్హత కలిగిన ప్రతి నేతన్నకు నేతన్న సేవలో పథకం ద్వారా ప్రభుత్వ ఆర్థిక ప్రయోజనం అందేలా అధికారులు సమగ్రంగా పనిచేయాలని ఆదేశించారు. శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం ఎన్డీఏ కార్యాలయంలో గురువారం ఆర్డీవో రాంభూపాల్ రెడ్డి, హ్యాండ్లూమ్ ఏడి అప్పాజీ, చేనేత శాఖ అధికారులతో మంత్రి సత్యకుమార్ యాదవ్ నేతన్న సేవలో పథకం అమలు తీరుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పథకం ద్వారా ఇప్పటివరకు ఎంతమంది నేతన్నలకు ప్రయోజనం అందింది, అర్హత ఉన్నప్పటికీ ఇంకా ఎంతమందికి ప్రయోజనం అందలేదు, అందకపోవడానికి గల కారణాలు ఏమిటనే అంశాలపై అధికారులను మంత్రి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా, ఈ అంశంపై ఇప్పటికే సంబంధిత రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత, ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్, కలెక్టర్ తదితర ఉన్నతాధికారులతో తాను చర్చించిన విషయాన్ని మంత్రి సత్యకుమార్ యాదవ్ అధికారులకు తెలియజేశారు. రాష్ట్ర స్థాయిలోనూ నేతన్నల సంక్షేమం, అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకం ప్రయోజనం అందించడంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నేతన్నల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని అమలు చేస్తున్న నేతన్న సేవలో పథకం ద్వారా మొదటి విడతలో రాష్ట్రవ్యాప్తంగా 71,536 మంది నేతన్నలకు ఒక్కొక్కరికి రూ.25 వేల చొప్పున ఆర్థిక సాయం అందించినట్లు మంత్రి తెలిపారు. పథకానికి సంబంధించి కొత్తగా 36,617 దరఖాస్తులు అందాయని, వీటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి నిజమైన అర్హులను గుర్తించే ప్రక్రియ ప్రస్తుతం కొనసాగుతోందని వెల్లడించారు. అర్హులైన నేతన్నలను గుర్తించేందుకు అధికారులు ఇంటింటికీ వెళ్లి పరిశీలన నిర్వహిస్తున్నారని, ఈ లబ్ధిదారుల గుర్తింపు కార్యక్రమాన్ని ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. అర్హుల గుర్తింపు ప్రక్రియ పూర్తయిన వెంటనే రెండో విడతలో మిగిలిపోయిన అర్హులైన నేతన్నలకు ఒక్కొక్కరికి రూ.25 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేస్తామని మంత్రి స్పష్టం చేశారు. పథకం ప్రయోజనం పొందేందుకు అర్హత ఉన్న ఏ ఒక్క నేతన్న కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి భరోసా ఇచ్చారు. అర్హత ఉన్న ప్రతి ఒక్క నేతన్నకూ నేతన్న సేవలో పథకం వర్తింపజేస్తామని, అర్హుల గుర్తింపు ప్రక్రియలో ఎవరి పేరు మిగిలిపోయినా, అర్హత ఉన్నప్పటికీ ప్రయోజనం అందకపోయినా దానిపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిజమైన అర్హులకు చేరడమే ప్రభుత్వ లక్ష్యం. అర్హత ఉన్న ఒక్క నేతన్నకు కూడా అన్యాయం జరగకూడదు. ఎక్కడైనా అర్హుడికి అన్యాయం జరిగినట్లు తేలితే సహించేది లేదు అని మంత్రి సత్యకుమార్ యాదవ్ అధికారులకు స్పష్టం చేశారు. సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి వివక్షకు, రాజకీయ జోక్యానికి, అనర్హులకు ప్రయోజనం కల్పించే విధానాలకు తావులేకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని మంత్రి సూచించారు. అర్హతలను నిబంధనల ప్రకారం పారదర్శకంగా పరిశీలించి, నిజమైన లబ్ధిదారులను గుర్తించి వారికి ప్రభుత్వ ప్రయోజనం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చేనేత రంగంపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం మరింత భరోసాను కల్పిస్తుందని మంత్రి పేర్కొన్నారు. నేతన్నల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని, అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆయన ఆదేశించారు. నేతన్నల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను సద్వినియోగం చేసుకోవాలని, అర్హులైన వారు ఎవరైనా పథకం ప్రయోజనం అందకపోతే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని మంత్రి సూచించారు. అర్హులైన ప్రతి నేతన్నకు న్యాయం జరిగే వరకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు.

# ఘనంగా తెలుగు భాషా దినోత్సవ సంబరాలు

**లేపాక్షి ఫౌండేషన్ నిరంతర సాహితీసేవలు అమోఘం - బలరాం రెడ్డి**

**తెలుగు భాషాభివృద్ధికి లేపాక్షి ఫౌండేషన్ ముందుంటుంది - వడ్డి సుధాకర్**



**హిందూపురం, ఆగస్టు 27 ((విజన్ ఆంధ్ర) ప్రతినిధి )**

లేపాక్షి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వడ్డి సుధాకర్ అధ్యక్షతన సత్యసాయి జిల్లా అధ్యక్షులు పి.చంద్రశేఖర్ పర్యవేక్షణలో ఘనంగా తెలుగు భాషా దినోత్సవ సంబరాలు ముందస్తుగా హిందూపురంలోని బాలయేసు కళాశాలలో గురువారం నాడు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హిందూపురం మున్సిపాలిటీ మాజీ చైర్మన్ బలరాం రెడ్డి మాట్లాడుతూ తెలుగు భాషాభివృద్ధిలో లేపాక్షి ఫౌండేషన్ సేవలు అమూల్యమన్నారు. మండల విద్యాధికారి డా.గంగప్ప మాట్లాడుతూ తెలుగు భాషా వికాసానికి అందరూ కృషి చెయ్యాలని కోరారు.ప్రెస్ క్లబ్ అధ్యక్షులు రామాంజినేయులు మాట్లాడుతూ ఈ రకంగా పోటీలు నిర్వహించి పోటీతత్వాన్ని, తెలుగుపై అభిరుచి పెంచే కార్యక్రమం చెయ్యడంలో సుధాకర్ చంద్రశేఖర్ కృషి అభినందనీయం అన్నారు. సత్యసాయి జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ మాట్లాడుతూ తెలుగును వెలిగించడంలో విద్యార్థులు ప్రముఖ పాత్ర పోషించాలని అన్నారు. అనంతరం పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.ఈ కార్యక్రమంలో సామాజిక వేత్త ఉమర్ ఫరూక్, కల్లూరు రాఘవేంద్రరావు, తెలుగు అధ్యాపకులు అశ్వర్థ నారాయణ,విద్యార్థిని విద్యార్థులు ఉపాధ్యాయులు భాషాభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఏపీఎస్ఆర్టీసీ రిటైర్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు తిరుపతి డిపో వద్ద రిటైర్ ఉద్యోగుల ధర్నా




**తిరుపతి, ఆగస్టు 27((విజన్ ఆంధ్ర) ప్రతినిధి)**

ఏపీఎస్ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులు గురువారం తిరుపతి డిపో వద్ద తమ సమస్యల సాధనకై గేటు మీటింగు కేఆర్ఎస్ మన్యం అధ్యక్షతన జరిగినది.ఈ గేటు మీటింగులో పాల్గొన్న అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జి బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ 2020 తర్వాత రిటైర్ అయిన ఉద్యోగులకు గ్రావిటీ లీవ్ ఎన్కాష్మెంటు వెంటనే చెల్లించాలని ఈపీఎఫ్ ఆఫీసు బర్కతపురా నుండి ఏపీకి తరలించాలని 1996 2014 ఈపీఎఫ్కు జమ చేసిన ఆయుర్ పెన్షన్ కోసం డిడి ద్వారా పంపిన డబ్బులను తిరిగి ఇవ్వాలని ప్రో రేట పెన్షన్ విధానము రద్దు చేయాలని సూపర్ లగ్జరీలో అనుమతించాలని 2013 2017 పే స్కేల్స్ నిజమేతనాలపై పెన్షన్ ఫిక్స్ చేయాలని 58 సంవత్సరాలకు బదులు 62 సంవత్సరాల వరకు ఈపీఎఫ్ కు కట్టిన డబ్బులు నాలుగు సంవత్సరాల డబ్బు వాపస్ చేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఆర్ ఎస్ ఎన్ రెడ్డి ప్రధాన కార్యదర్శి జి సుధాకర్ కోశాధికారి జిఎస్ మన్యం ఆర్గనైజింగ్ సెక్రెటరీ జి ఎస్ ప్రకాష్ నాగేశ్వరరావు ఏవి రమణ వి ఎస్ మన్యం కే ఎం వి రాయులు వినయ్ కుమార్ ఎంకే రెడ్డి డిపిఆర్ రెడ్డి జీవీఎం కుమారు ఎన్ఎస్ మన్యం తదితరులు పాల్గొని ఉన్నారని జి బాలసుబ్రమణ్యం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# శ్రీశైలం విషాద బాధిత కుటుంబానికి మంత్రి సత్యకుమార్ యాదవ్ పరామర్శ

**- బత్తలపల్లి టీచర్స్ కాలనీలో బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి సత్యకుమార్ యాదవ్**

**- తక్షణ సాయంగా రూ.50 వేల ఆర్థిక సహాయం.. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా**

**- రానున్న నెలలో కొత్త పింఛన్ మంజూరుకు చర్యలు తీసుకుంటాం: మంత్రి సత్యకుమార్ యాదవ్**





**బత్తలపల్లి, ఆగస్టు 27 (విజన్ ఆంధ్ర) ప్రత్యేక ప్రతినిధి**

శ్రీశైలంలో చోటుచేసుకున్న విషాదకర ఘటనలో ధర్మవరం నియోజకవర్గం, బత్తలపల్లి చెందిన కుటుంబ సభ్యులు మృతి చెందడం పట్ల రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య శాఖమంత్రి , ధర్మవరం నియోజకవర్గ శాసనసభ్యులు సత్యకుమార్ యాదవ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో గురువారం బత్తలపల్లి మండల కేంద్రంలోని టీచర్స్ కాలనీలో ఉన్న బాధిత కుటుంబ స్వగృహానికి మంత్రి సత్యకుమార్ యాదవ్, ఆర్డీఓ రాంభూపాల్ రెడ్డి, ఎమ్మార్వో ఈశ్వర ప్రసాద్, ఎంపీడీవో కిష్టప్ప, తదితర అధికారులతో కలిసి వెళ్లారు. కుటుంబ సభ్యుడు గోకల రాముడును పరామర్శించి, ప్రస్తుత కుటుంబ పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, వారికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. శ్రీశైలంలో జరిగిన ఘటనలో కుటుంబ సభ్యులను కోల్పోయిన నేపథ్యంలో గోకల రాముడు కుటుంబం ఎదుర్కొంటున్న పరిస్థితులను మంత్రి సత్యకుమార్ యాదవ్ గారు స్వయంగా అడిగి తెలుసుకున్నారు. కుటుంబానికి ప్రస్తుతం ఉన్న అవసరాలు, ఆర్థిక పరిస్థితి తదితర అంశాలపై అధికారులతో చర్చించారు.

తక్షణ సాయంగా రూ.50 వేల ఆర్థిక సహాయం....

బాధిత కుటుంబానికి తక్షణ ఉపశమనంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ తనవంతుగా రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కష్ట సమయంలో కుటుంబం ఒంటరిగా లేదని, ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు అన్ని విధాలా అండగా ఉంటారని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. అదేవిధంగా కుటుంబ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తరఫున అందించగల ఇతర సహాయ సహకారాలపై మంత్రి అక్కడికక్కడే ఆర్డిఓ, ఎమ్మార్వో, ఎంపీడీవో, తదితర అధికారులతో చర్చించారు. అవసరమైన చర్యలను వేగంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కుటుంబ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని రానున్న నెలలో కొత్త పింఛన్ల మంజూరుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే ప్రక్రియలో గోకల రాముడికి పింఛన్ మంజూరయ్యేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి సత్యకుమార్ యాదవ్ హామీ ఇచ్చారు. అర్హతకు అనుగుణంగా పింఛన్ కోసం దరఖాస్తు చేసుకునేలా సంబంధిత అధికారులు సహకరించాలని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం పింఛన్ మంజూరుకు అవసరమైన ప్రక్రియను పూర్తి చేయాలని మంత్రి సూచించారు. ఈ కష్ట సమయంలో కుటుంబానికి ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు అండగా ఉంటారు. కుటుంబ సభ్యులు అధైర్యపడాల్సిన అవసరం లేదు. ప్రభుత్వం నుంచి అందించగల ప్రతి సహాయాన్ని అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటాం అని మంత్రి బాధిత కుటుంబానికి భరోసా ఇచ్చారు.

సమస్యలను పంచుకుంటే పరిష్కారం దొరుకుతుంది....

జీవితంలో ఎలాంటి క్లిష్ట పరిస్థితులు ఎదురైనా వాటిని ఒంటరిగా ఎదుర్కోవద్దని సూచించారు. కుటుంబ సభ్యులు, ఆత్మీయులు, స్నేహితులతో సమస్యలను పంచుకుని, వారి సహకారంతో పరిష్కార మార్గాలను అన్వేషించాలని కోరారు. జీవితంలో ఎలాంటి సమస్య ఎదురైనా దానికి పరిష్కారం ఉంటుంది. కష్టకాలంలో ఆత్మీయులతో, కుటుంబ సభ్యులతో, స్నేహితులతో మాట్లాడాలి. సమస్యను పంచుకుంటే పరిష్కారానికి మార్గం దొరుకుతుంది. ఆవేశానికి లోనై ఆత్మహత్య వంటి తీవ్రమైన నిర్ణయాలకు ఎవరూ పాల్పడవద్దు అని మంత్రి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రతి ఒక్కరి జీవితం ఎంతో విలువైనదని, ఎంతటి క్లిష్ట పరిస్థితి ఎదురైనా ధైర్యంగా నిలబడి పరిష్కారం కోసం ప్రయత్నించాలని మంత్రి సూచించారు. కష్టాల్లో ఉన్నవారికి కుటుంబ సభ్యులు, ఆత్మీయులు అండగా నిలవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో బత్తలపల్లి బిజెపి మండల అధ్యక్షులు ఆకులేటి భాస్కర్, ఆకులేటి వీరనారప్ప, కోటి బాబు, తిరుపతయ్య, మల్లికార్జున, తదితర స్థానిక నాయకులు, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

# రైతుల భూ సమస్యలకు 40 రోజుల్లో పరిష్కారం

**కృష్ణాపురం ప్రత్యేక గ్రామసభలో అర్జీలు స్వీకరించిన**

**-ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి**



**బుక్కపట్నం, ఆగస్టు 27 ((విజన్ ఆంధ్ర) విలేకరి):**

రైతుల భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించి వారికి న్యాయం చేయాలని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి అధికారులను ఆదేశించారు. బుక్కపట్నం మండలం కృష్ణాపురం పంచాయతీలో గురువారం నిర్వహించిన ప్రత్యేక గ్రామసభలో ఆమె పాల్గొని రైతుల నుంచి భూ సమస్యలకు సంబంధించిన అర్జీలను స్వీకరించారు.ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, ఆర్డీఓ సువర్ణ తదితరులు పాల్గొని ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కృష్ణాపురం పంచాయతీ పరిధిలో సుమారు 1,157 ఎకరాల 22ఏ భూములు, మరో 1,000 ఎకరాల చుక్కల భూములు ఉన్నట్లు అధికారులు వివరించారు.ఈ సందర్భంగా 15 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యను వెంకటరమణ అనే రైతుకు పరిష్కరించినట్లు తెలిపారు. దీంతో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్య పరిష్కారం కావడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు.ఇక మిగిలిన 22ఏ భూములకు సంబంధించిన సమస్యలను కూడా ప్రాధాన్యతతో పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. మరో 40 రోజుల్లో 22ఏ భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. రైతులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి లేకుండా గ్రామస్థాయిలోనే సమస్యలను గుర్తించి పరిష్కరించాలని సూచించారు.రైతుల భూములకు సంబంధించిన రికార్డులను పరిశీలించి, అర్హత ఉన్న వారికి న్యాయం జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి సూచించారు. భూ సమస్యల పరిష్కారంలో జాప్యం లేకుండా నిర్ణీత గడువులో చర్యలు పూర్తి చేయాలని ఆదేశించారు.

# ప్రజా భద్రతకు మరొక ముందడుగు..









- క్యూఆర్ కోడ్ నంబర్ ఉండడం వల్ల ఆటోలపై మరింత నమ్మకం పెరుగుతుంది..
- ప్రజల భద్రతే లక్ష్యంగా ఆటోలకు డిజిటల్ నంబర్ వ్యవస్థ అమలు...
- క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే డ్రైవర్ వివరాలు, లైవ్ లొకేషన్...
- రాత్రివేళల్లో ప్రయాణించే మహిళలు, వృద్ధులకు మరింత భద్రత.. నమ్మకం..
- లైవ్ లొకేషన్ షేర్ చేయడం వల్ల కుటుంబ సభ్యులకు మరింత ధైర్యం..

**కదిరి, ఆగస్టు 27((విజన్ ఆంధ్ర) ప్రతినిధి)**

శ్రీ సత్యసాయి జిల్లా కదిరి పట్టణంలో 250 ఆటోలకు క్యూఆర్ కోడ్ డిజిటల్ స్టిక్కర్లను పంపిణీ చేసిన జిల్లా ఎస్పీ ఎస్ సతీష్ కుమార్ ఐపీఎస్..

శ్రీ సత్యసాయి జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రయాణికుల భద్రతను మరింత బలోపేతం చేయడంతో పాటు ఆటోరిక్షా డ్రైవర్లకు డిజిటల్ గుర్తింపు కల్పించే లక్ష్యంతో, ప్రజా భద్రతకు మరొక ముందడుగు వేస్తూ ఆటో డిజిటలైజేషన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

కదిరి పట్టణంలో గురువారం కదిరి పోలీస్ శాఖ మరియు రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా ఎస్పీ శ్రీ ఎస్. సతీష్ కుమార్, ఐపీఎస్ , 250 మంది ఆటో డ్రైవర్లకు డిజిటల్ ఐడీ కార్డులు, క్యూఆర్ కోడ్ స్టిక్కర్లను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ..

ప్రయాణికుల భద్రతను మరింత బలోపేతం చేసే విధంగా ప్రతి ఆటో డ్రైవర్ వివరాలు, వాహన రిజిస్ట్రేషన్, డ్రైవింగ్ లైసెన్స్, ఫోటో తదితర సమాచారాన్ని భద్రత కలిగిన వెబ్ పోర్టల్‌లో నమోదు చేసి, ప్రత్యేక డిజిటల్ ఐడీతో కూడిన క్యూఆర్ కోడ్‌ను రూపొందిస్తున్నట్లు వెల్లడించారు.

ఆటోలో అమర్చిన క్యూఆర్ కోడ్‌ను ప్రయాణికులు స్కాన్ చేస్తే డ్రైవర్ వివరాలు, వాహన యజమాని సమాచారం, లైవ్ లొకేషన్ షేరింగ్, సమీప పోలీస్ స్టేషన్ వివరాలు, ఫిర్యాదు నమోదు, అత్యవసర కాల్, డ్రైవర్‌కు రేటింగ్ తదితర మొత్తం 8 భద్రతా సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.

ఈ విధానం ద్వారా మహిళలు, విద్యార్థులు, వృద్ధులు, రాత్రి వేళల్లో ప్రయాణించే వారికి మరింత భద్రత, విశ్వాసం కలుగుతుందని ఎస్పీ పేర్కొన్నారు.

ఆటోలో ప్రయాణిస్తున్న సమయంలో లైవ్ లొకేషన్‌ను కుటుంబ సభ్యులతో షేర్ చేసుకునే అవకాశం ఉండడం వల్ల ప్రయాణికుల కుటుంబ సభ్యులకు కూడా మరింత ధైర్యం, భరోసా కలుగుతుందని తెలిపారు.

దీంతో ఆటోలపై ప్రజల్లో మరింత నమ్మకం, విశ్వాసం పెరుగుతుందని ఎస్పీ పేర్కొన్నారు.

కదిరిలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించగా, గతంలో 150 ఆటోలకు, ప్రస్తుతం 250 ఆటోలకు కలిపి మొత్తం 400 ఆటోలకు క్యూఆర్ కోడ్ నంబర్లు అందజేయడం జరిగిందని ఎస్పీ తెలిపారు.

అదేవిధంగా ధర్మవరంలో 550600 ఆటోలకు, హిందూపురంలో 190 ఆటోలకు క్యూఆర్ కోడ్ ప్రక్రియ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు.

ఇంకా సుమారు 300 ఆటోలకు క్యూఆర్ కోడ్ నంబర్లు అందజేయాల్సి ఉందని, వాటిని కూడా త్వరలోనే పూర్తి చేస్తామని తెలిపారు.

మిగిలిన వారు కూడా సెప్టెంబర్ 15 లోపు క్యూఆర్ కోడ్ నమోదు చేసుకోవాలని, లేదంటే చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని ఎస్పీ తెలియజేశారు.

ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఆటో యూనియన్లు, డ్రైవర్లు పూర్తి సహకారం అందించాలని ఎస్పీ కోరారు. నిర్ణీత గడువులోగా క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేయని వాహనాలపై నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

సురక్షిత జిల్లాగా శ్రీ సత్యసాయి జిల్లా

సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించి ప్రజలకు మరింత భద్రత కల్పిస్తూ శ్రీ సత్యసాయి జిల్లాను సురక్షిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు పోలీస్ శాఖ కట్టుబడి ఉందని ఎస్పీ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ శ్రీమతి అంకిత సురాన, ఐపీఎస్ , డి.ఎస్.పి శివన్నారాయణ స్వామి, సీఐలు వెంకటేశ్వర్లు, లక్ష్మీకాంత్ రెడ్డి, నిరంజన్ రెడ్డి, నాగేంద్ర, రవాణా శాఖ అధికారులు, ఎస్సైలు, పోలీస్ మరియు రవాణా శాఖ సిబ్బంది, ఆటో యూనియన్ ప్రతినిధులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారని పుట్టపర్తి జిల్లా పోలీస్ కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# నల్లమాడలో ఇళ్లపై మృత్యు తీగలు.. 11 కేవీ లైన్లతో ప్రజల్లో భయాందోళన

**- ప్రమాదం పొంచి ఉందంటున్న నల్లమాడ వైఎస్సార్ సర్కిల్ వాసులు**



**నల్లమాడ, ఆగస్టు 27 ((విజన్ ఆంధ్ర) విలేకరి):**

నల్లమాడ వైఎస్సార్ సర్కిల్ సమీపంలో ఇళ్లపై నుంచి 11 కేవీ విద్యుత్ లైన్లు వెళ్తుండటంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 100కు పైగా ఇళ్లపై నుంచి విద్యుత్ లైన్లు ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. గతంలో ఇదే ప్రాంతంలో విద్యుత్ లైన్ల కారణంగా ప్రమాదం జరిగినప్పటికీ సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు ఇప్పటివరకు తగిన చర్యలు తీసుకోలేదని స్థానికులు వాపోతున్నారు. సమస్యను పరిష్కరించాలని పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన కనిపించలేదని వారు ఆరోపిస్తున్నారు. విద్యుత్ లైన్లు ఇళ్లకు అత్యంత సమీపంగా ఉండటంతో చిన్నపాటి నిర్లక్ష్యం జరిగినా ప్రాణనష్టం జరిగే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు నివసించే ప్రాంతంలో ఇలాంటి పరిస్థితి కొనసాగడం ఆందోళనకరమని పేర్కొన్నారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించకుండా, ముందుగానే చర్యలు తీసుకోవాలని స్థానికులు విద్యుత్ శాఖ అధికారులను కోరుతున్నారు. 11 కేవీ విద్యుత్ లైన్లను జనావాసాలపై నుంచి తొలగించి, సురక్షిత ప్రాంతానికి మార్చాలని విజ్ఞప్తి చేస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## ఈవిఎం గోదాములను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



**చిత్తూరు, ఆగస్టు 27 ( విజన్ ఆంధ్ర ) :**
స్థానిక ఈవిఎం గోదాములను జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ కలెక్టరేట్లో ఉన్న పీజీర్స్ సమావేశ మందిర సమీపంలో ఉన్నఈవిఎం గోదాములను వికాస్ గురువారం కలెక్టర్ తనిఖీ చేశారు. గోదాము షట్టర్లకు వేసిన సీళ్లను, తాళాలను పరిశీలించారు. పోలీసు బందోబస్తుపై సమీక్షించారు. సిసి కెమేరాల ద్వారా చుట్టుప్రక్కల పరిస్తితులను పరిశీలించారు. అంతా అప్రమత్తంగా ఉండాలని అధికారులను, పోలీసు సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ కే. మోహన్ కుమార్, జిల్లా సహకార శాఖ అధికారి మరియు ఈవిఎం గోదాముల నోడల్ అధికారి శ్రీలక్ష్మి, కలెక్టరేట్ ఎన్నికల సూపరింటిండెంట్ రాజేంద్ర ఇతర రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గుండెపోటుతో కానిస్టేబుల్ మృతి

**గోపవరం, ఆగస్ట్ 27 (విజన్ ఆంధ్ర)**



గోపవరం పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ శివప్రసాద్ రెడ్డి బేస్తవారం ఉదయం కడపలోని తన స్వగృహంలో గుండెపోటుతో మృతి చెందారు శివ ప్రసాద్ రెడ్డి మృతి చెందిన విషయం తెలుసుకున్న వెంటనే మైదుకూరు డిఎస్పి రాజేంద్రప్రసాద్, బద్వేలు రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కృష్ణయ్య, గోపవరం ఎస్సై చిరంజీవి, ఇతర సహచర పోలీస్ సిబ్బంది శివ ప్రసాద్ రెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు అనంతరం శివప్రసాద్ రెడ్డి భార్యను ఓదార్చి మనోధైర్యాన్ని కల్పించారు మీ కుటుంబానికి ఎల్లప్పుడూ డిపార్ట్మెంట్ అండగా ఉంటుందని భరోసా కల్పించి వారిని ఓదార్చి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి సంతాపాన్ని తెలిపారు

## వరసిద్ధి వినాయక స్వామి వారికి చిలుక వాహనంపై వైభవంగా గ్రామోత్సవం



**కాణిపాకం, ఆగస్టు 27 ( విజన్ ఆంధ్ర )**
స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి దేవస్థానం కాణిపాకం శ్రీ స్వామి వారి ఆలయము నందు శ్రావణ పౌర్ణమి సందర్భంగా స్వామివారి ఉత్సవ మూర్తులకు ప్రత్యేక అభిషేకము, కల్యాణోత్సవం, మరియు శ్రీ సిద్ధి బుద్ధి సమేత వరసిద్ధి వినాయక స్వామి వారికి చిలుక వాహనంపై వైభవంగా గ్రామోత్సవం నిర్వహించడం జరిగింది, ఈ కార్యక్రమానికి ఉభయదారులుగా కాణిపాకం చెందిన రేపాకుల కుటుంబ సభ్యులు, మోహన్ శెట్టి వారి సోదరులు నిర్వహిస్తారు, ఈ కార్యక్రమంలో దేవస్థాన ఈ.వో పెంచల కిషోర్, తదితరులు ఉన్నారు.

## వినాయకుని సేవలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి



**కాణిపాకం, ఆగస్టు 27 (విజన్ ఆంధ్ర) :**
స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి దేవస్థానం కాణిపాకం శ్రీ స్వామి వారిని దర్శించుకున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆలపాటి గిరిధర్, వారి కుటుంబ సభ్యులు స్వామివారిని దర్శించుకున్నారు, వీరికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసి స్వామి వారి తీర్థప్రసాదాలు శేషవస్త్రం చిత్రపటాన్ని అందజేసిన ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, ఈ కార్యక్రమంలో సూపర్డెంట్ వాసు, టెంపుల్ ఇన్స్పెక్టర్ బాలాజీ నాయుడు, కాణిపాకం ఎస్సై నరసింహులు, చిత్తూరు కోర్టు సిబ్బంది తదితరులు ఉన్నారు.

## అల్లర్లకు పాల్పడితే బైండోవర్ కేసులు తప్పవు - రూరల్ సీఐ కృష్ణయ్య



**బద్వేలు,ఆగస్టు 27 (విజన్ ఆంధ్ర)**
బద్వేలు పట్టణంలో రాబోయే మున్సిపాలిటీ, పంచాయతీ, జడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో ఓటు హక్కును వినియోగించు కోవాలని బద్వేల్ రూరల్ సీఐ కృష్ణయ్యసూచించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు బద్వేల్ పట్టణంలోని 31, 32 వార్డుల సురేంద్రనగర్లో ప్రజలకు, రూరల్ సీఐ కృష్ణయ్య ఆధ్వర్యంలో పోలీసులు అవగాహన కార్యక్రమంనిర్వహించారు.ఈ సందర్భంగా సీఐ కృష్ణయ్య మాట్లాడుతూ ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉండాలన్నారు. ఎవరూ తగవులకు, అల్లర్లకు పాల్పడవద్దని, ఎవరైనా రెచ్చగొట్టినా రెచ్చిపోకుండా ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.ప్రలోభాలకు లొంగవద్దని, నిర్భయంగా ఓటు వేయాలని సూచించారు. ఎన్నికల సమయంలో అల్లర్లకు పాల్పడినా, శాంతిభద్రతలకు భంగం కలిగించినా బైండోవర్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏదైనా సమస్య ఉంటే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని ప్రజలకు పోలీసులు ఎల్లవేళలా మీకు అందుబాటులో అండగా ఉంటామని తెలియ చేశారు. ఈ కార్యక్రమంలో అట్లూరు ఎస్సై, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

## గుంతకల్ హనుమంతుకు జాతీయ అవార్డు

**అనంతపురం ఆగస్టు 27 (విజన్ ఆంధ్ర):**
ప్రాణదాత సేవా సమితి ప్రతినిధి బంటనహాల్ హనుమంతుకు చత్రపతి శివాజీ మహారాజ్ జాతీయ పురస్కారం వరించింది ఈ సందర్భంగా గుంటూరు జిల్లా పొన్నూరు ప్రాంతంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వంగవీటి ఆశకిరణ్ చేతుల మీదుగా గురువారం హనుమంతు ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా హనుమంతు మాట్లాడుతూ ఈ అవార్డు రావడం చాలా ఆనందంగా ఉందని ఈ సేవలో మరింత అంకితభావంతో అందించడానికి మరింత పట్టుదలతో పని చేస్తామని అన్నారు. అయితే అవార్డు రావడానికి ప్రాణదాత సేవాసమితి సభ్యులందరి కృషి వల్లనే ఈ అవార్డు రావడానికి



సాధ్యమైందని హనుమంతు పేర్కొన్నారు. జాతీయస్థాయి హనుమంతుకు ఈ పురస్కారం రావడంతో గుంతకల్లు ప్రాంత ప్రజలు ప్రాణదాత సేవా సమితి అభిమానులు పలువురు పెద్ద ఎత్తున అభినందనలు తెలియజేశారు.

## ఎంఎస్పిఎస్ ఆధ్వర్యంలో కరపత్రాలు విడుదల

**ఉరవకొండ ఆగస్టు 27 (విజన్ ఆంధ్ర):**
ఎమ్మెస్పిఎస్ ఆధ్వర్యంలో గురువారం సమాజ జాగృతి డ్రగ్స్ రహిత భారత్ అనే కార్యక్రమానికి సంబంధించి కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ మాట్లాడుతూ డ్రగ్స్ మహమ్మారి నుంచి యువతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రజలు విద్యార్థులు ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా వచ్చే నెల 23వ తేదీన అనంతపురంలో నిర్వహిస్తున్న సమాజ జాగృతి డ్రగ్స్ రహిత భారత్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రాజశేఖర్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజు , ఉరవకొండ నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి చిన్న రాయుడు, చాబాల



మాజీ సర్పంచ్ జగదీష్, ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల అధ్యక్షులు ఆనందరాజు సిపిఐ సహాయ కార్యదర్శి సుల్తాన్ ఎమ్మార్పీఎస్ నాయకులు పోలేరు రాకెట్ల శ్రీరామ్ ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ ఉరవకొండ కార్యదర్శి గోవిందు పిఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి హిరణ్య ఎంఆర్పిఎస్ పృథ్వీరాజ్ ఎంఎస్ఎఫ్ గణేష్ తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి జన్మదిన వేడుకలు





**బద్వేలు, ఆగస్టు 27 (విజన్ ఆంధ్ర)**
బద్వేలు నియోజకవర్గ వైసిపి అదనపు సమన్వయకర్త నల్లేరు విశ్వనాథ రెడ్డి సారథ్యంలో శ్రీ అవధూత కాశినాయన మండలం, అమగంపల్లి సమీపంలోని బాలమ్మ సత్రం నందు కడప పార్లమెంట్ సభ్యులు, వైఎస్ అవినాష్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా బాలమ్మ సత్రంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. అనంతరం సత్రంలోని వృద్ధులు, అనాథలకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేసి, భోజన సదుపాయం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా నల్లేరు విశ్వనాథ రెడ్డి మాట్లాడుతూ,మూడు పర్యాయాలు ఘన విజయం సాధించి ప్రజల అభిమానాన్ని చూరగొన్న ప్రజానాయకుడు శ్రీ వైఎస్ అవినాష్ రెడ్డి అని కొనియాడారు. ఆయన కృషి, నాయకత్వంతో బద్వేల్ నియోజకవర్గంలో గ్రీన్ఫీల్డ్ హైవే, సెంచరీ ఫ్యాక్టరీ, లిఫ్ట్ ఇరిగేషన్ పనులు, అనేక దేవాలయాల మంజూరు చేయడంతో పాటు, అనేక అభివృద్ధి కార్యక్రమాలు ఆయన సారథ్యం లో జరిగాయని తెలియజేశారు ప్రజల సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న అవినాష్ రెడ్డికి సంపూర్ణ ఆయు రారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షించారూ ఈ కార్యక్రమములో బద్వేల్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వైఎస్ఆర్సిపి ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొనడం జరిగినది.

## విద్య, వైద్య రంగాలకు ప్రజా ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత...

### రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి





**ఖమ్మం. (విజన్ ఆంధ్ర)**
విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధికి స్కిల్ యూనివర్సిటీ, ప్రతి నియోజకవర్గంలో అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లు
అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు, అర్హులైన ప్రతి ఒక్కరికీ కొత్త పింఛన్
రూ.30 లక్షలతో గోపాలపురం పాఠశాలలో రెండు అదనపు తరగతి గదుల నిర్మాణం పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి పొంగులేటి
విద్య, వైద్య రంగాలకు ప్రజా ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు.
తిరుమలాయపాలెం మండలం ఎర్రగడ్డ గ్రామ పంచాయతీ పరిధి గోపాలపురం
గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో రూ.30 లక్షల వ్యయంతో నిర్మించనున్న రెండు అదనపు తరగతి గదుల నిర్మాణానికి గురువారం మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి శంకుస్థాపన చేశారు.
ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ రూ.30 లక్షలతో రెండు అదనపు తరగతి గదుల నిర్మాణాన్ని చేపడుతున్నామని తెలిపారు. విద్యార్థుల కోసం తాత్కాలిక షెడ్డు నిర్మించేందుకు టీచర్ సుమారు రూ.40 వేల సొంత డబ్బును వెచ్చించడం అభినందనీయమని అన్నారు. పిల్లల సంక్షేమం కోసం తన సొంత డబ్బును ఖర్చు చేసి తాత్కాలిక వసతి ఏర్పాటు చేసిన టీచర్ ను హృదయపూర్వకంగా అభినందిస్తున్నానని మంత్రి పేర్కొన్నారు.
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం గత రెండున్నరేళ్లుగా విద్య, వైద్య రంగాలను అత్యంత ప్రాధాన్యతా రంగాలుగా భావించి పనిచేస్తోందని మంత్రి అన్నారు. విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రత్యేకంగా దృష్టి సారించామని, స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని తెలిపారు. యువత ఉద్యోగాల కోసం ఎదురుచూసే వారిగా కాకుండా, ఉద్యోగాలు కల్పించే పారిశ్రామిక వేత్తలుగా ఎదిగేందుకు అవసరమైన శిక్షణ అందిస్తున్నామని చెప్పారు.
రాష్ట్రంలోని అన్ని ఐటీఐలను అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ (ATC)లుగా అప్గ్రేడ్ చేస్తున్నామని, ప్రతి అసెంబ్లీ నియోజక వర్గంలో ఒక ఏటిసి ఏర్పాటు చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఆయా కేంద్రాల ద్వారా యువతకు ఆధునిక నైపుణ్యాలతో కూడిన కోర్సుల్లో శిక్షణ అందించి, ఉపాధి అవకాశాలు పొందడంతో పాటు ఇతరులకు ఉపాధి కల్పించే స్థాయికి ఎదిగేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. భవిష్యత్



అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఏటిసి లను దూరదృష్టితో ఏర్పాటు చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు.
తిరుమలాయపాలెం మండలంలో వైద్య రంగానికి కూడా ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి అన్నారు. పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, కొత్త ఆసుపత్రుల నిర్మాణంతో పాటు ఆసుపత్రుల్లో వైద్యులు, మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు.
రైతు సంక్షేమానికి ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంటోందని మంత్రి అన్నారు. గత రెండున్నరేళ్లలో మహిళా సంఘాలకు రూ.63 వేల కోట్ల వడ్డీలేని రుణాలు అందించామని తెలిపారు. రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం అందిస్తున్నా మని, కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తున్నా మని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల మొదటి దశలో ఇళ్లను మంజూరు చేశామని, ప్రస్తుతం రెండో దశ ఇళ్లను అందిస్తున్నామని, అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందుతుందని స్పష్టం చేశారు.
కొత్త పింఛన్ల మంజూరు కోసం ఆగస్టు 31 వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని మంత్రి తెలిపారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ కొత్త పింఛన్ అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు.
జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ గోపాలపురం పాఠశాల భవనం అత్యంత దెబ్బతిన్న స్థితిలో ఉందని, మరమ్మతులు చేపట్టే అవకాశం లేకపోవడంతో అమ్మ ఆదర్శ పాఠశాల పనుల్లో ఈ పాఠశాలను చేర్చలేదని తెలిపారు. మంత్రి ఆదేశాల మేరకు రూ.30 లక్షలతో రెండు అదనపు తరగతి గదుల నిర్మాణానికి నిధులు మంజూరు చేసి, ప్రస్తుతం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించామని చెప్పారు.
పాఠశాలలో విద్యార్థుల కోసం టీచర్ సుమారు రూ.30 వేల సొంత నిధులతో తాత్కాలిక షెడ్డు ఏర్పాటు చేశారని కలెక్టర్ తెలిపారు. టీచర్ సేవాభావాన్ని మంత్రి అభినందించారని పేర్కొన్నారు. నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి, మంత్రి చేతుల మీదుగా ప్రారంభోత్సవం నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.
ఈ కార్యక్రమంలో ఏదులాపురం మునిసిపల్ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత, పిఆర్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, ఆర్ అండ్ బి ఎస్ఈ యుగంధర్ రావు, హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, తిరుమలాయపాలెం మండల ఎంపీడీవో సిలార్ సాహెబ్, తహశీల్దార్ విల్సన్, ఎర్రగడ్డ గ్రామ పంచాయతీ సర్పంచ్ నల్లమల్ల కీర్తి నీరన్ కుమార్, ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్.

విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
శుక్రవారం 28-8-2026

## నిర్విఘ్నంగా గణేశ్ ఉత్సవాలు!

## అన్ని శాఖల సమన్వయంతో కట్టుదిట్టమైన ఏర్పాట్లు



**(విజన్ ఆంధ్ర) సైబరాబాద్:**
గణేశ్ నవరాత్రోత్సవాలను భక్తులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా అత్యంత వైభవంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అధికార యంత్రాంగం పూర్తి స్థాయిలో సన్నద్ధమైంది. పండుగ ఏర్పాట్లపై శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని మియాపూర్ 48వ సర్కిల్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం వివిధ అనుబంధ శాఖల అధికారులతో కీలక సమన్వయ సమావేశం జరిగింది. ఉత్సవాల సందర్భంగా ట్రాఫిక్ నియంత్రణ, పారిశుధ్య నిర్వహణ, నిరంతర విద్యుత్, తాగునీటి సరఫరాతో పాటు అగ్నిమాపక భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ వంటి కీలక అంశాలపై ఇందులో కూలంకషంగా చర్చించారు. ప్రధానంగా సమస్యాత్మక ప్రాంతాలను ముందుగానే గుర్తించి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్టమైన ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని, అత్యవసర పరిస్థితుల్లో తక్షణమే స్పందించేలా కట్టుదిట్టమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగినంత సిబ్బందిని, వనరులను అందుబాటులో ఉంచుతూ, అన్ని విభాగాల మధ్య పూర్తి సమన్వయంతో ఈ ఏడాది వేడుకలను పండుగ వాతావరణంలో దిగ్విజయంగా పూర్తి చేయాలని అధికారులు తీర్మానించారు.

## వాసవి వరల్డ్ స్కూల్‌లో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు



**(విజన్ ఆంధ్ర) నిర్మల్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 27 :**
నిర్మల్‌లోని వాసవి వరల్డ్ స్కూల్‌లో సోదర సోదరీమణుల మధ్య ప్రేమ, అనుబంధం, పరస్పర రక్షణకు ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు విద్యార్థులకు రాఖీలు కట్టి శు భాకాంక్షలు తెలిపారు. రక్షాబంధన్ పండుగ విశిష్టత, భారతీయ సంస్కృతిలో కుటుంబ బంధాలకు ఉన్న ప్రాధాన్యత, పరస్పరం ప్రేమ, గౌరవం, బాధ్యతతో మెలగాల్సిన ఆవశ్యకతను పాఠశాల ప్రిన్సిపాల్ విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు ఉత్సాహంగా కార్యక్రమంలో పాల్గొని ప్రేమనమ్మకంరక్షణ అనే రక్షాబంధన్ సందేశాన్ని చాటిచెప్పారు. ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థుల్లో భారతీయ సంప్రదాయాల పట్ల గౌరవాన్ని పెంపొందించడంతో పాటు సోదరభావం, ఐక్యత, పరస్పర సహకారం వంటి మానవీయ విలువలను బలోపేతం చేస్తాయని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల సెక్రటరీ జగదీష్ రెడ్డి, కరెస్పాండెంట్ పోత రెడ్డి, ప్రిన్సిపాల్ శైల జాయ్‌సన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



**(విజన్ ఆంధ్ర),నల్లబెల్లి:**
మండలంలోని రుద్రగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గేదె కరుణాకర్ ఇటీవల గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు.విషయం తెలుసుకున్న నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి గురువారం రుద్రగూడెంలోని కరుణాకర్ నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ సందర్భంగా కరుణాకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే.. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.కరుణాకర్ మృతి పార్టీకి తీరని లోటని,కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని ఓదార్చారు.కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు,యువజన కాంగ్రెస్ నాయకులు,గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరామ నామమే ధర్మానికి రక్ష



**(విజన్ ఆంధ్ర) రాయికల్,ఆగస్టు 27:**
శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామివారి సప్తతి తిరునక్షత్రాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్న శ్రీరామ హృదయ కలశ యాత్ర మహితాపూర్‌కు చేరుకుంది. గ్రామ సర్పంచ్ తలారి నాగమణిరాజేష్, ఉపసర్పంచ్ దొంగ ప్రణయ్ రెడ్డి, వార్డు సభ్యులు లింగంపల్లి లక్ష్మణ్, బొమ్మెన లక్ష్మి, ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు సంగ మల్లయ్య యాదవ్ భక్తిశ్రద్ధలతో కార్యక్రమంలో పాల్గొన్నారు. అర్చకులు క్యాసనూరి జగదీశ్వర్, వికాస తరంగిణి బాధ్యులు వేల్పుల స్వామి యాదవ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మామిడిపెల్లి గంగారాజం, కొయ్యడి సదాశివ్ రెడ్డి, బొమ్మెన బాపు, బొమ్మెన నరేష్తో పాటు భక్తులు, మహిళలు పాల్గొన్నారు. ప్రజలు సుభిక్షంగా ఉండాలని, సమృద్ధిగా వర్షాలు కురవాలని, లోకకళ్యాణం జరగాలని ప్రార్థించి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

## రవీంద్రభారతిలో పద్మశాలి సర్పంచ్ సతీష్‌కు ఘన సన్మానం



**(విజన్ ఆంధ్ర),జగిత్యాల బ్యూరో, ఆగస్టు 27:**
హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో బీసీ టైమ్స్, జనాధికార సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన పద్మశాలి సర్పంచుల అభినందన సభ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జగిత్యాల జిల్లా, జగిత్యాల రూరల్ మండలం కన్నాపూర్ గ్రామ ఏకగ్రీవ సర్పంచ్ పొట్టవత్తిని సతీష్‌ను ఘనంగా సన్మానించారు.కేంద్ర ప్రభుత్వ జాయింట్ సెక్రటరీ పరికిపండ్ల నరహరి, ఐఏఎస్ చేతుల మీదుగా సతీష్‌కు సన్మానం నిర్వహించారు.గ్రామ ప్రజల విశ్వాసంతో ఏకగ్రీవంగా సర్పంచ్‌గా ఎన్నికై గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్నందుకు గుర్తింపుగా ఈ సన్మానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా సర్పంచ్ పొట్టవత్తిని సతీష్ మాట్లాడుతూ, తనపై నమ్మకంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్న కన్నాపూర్ గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.గ్రామాభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం మరింత బాధ్యతతో పనిచేస్తానని పేర్కొన్నారు.కార్యక్రమంలో బీసీ టైమ్స్, జనాధికార సంస్థ ప్రతినిధులు, పద్మశాలి సర్పంచులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## అశ్వాపురం గ్రామపంచాయతీలో

## ఓటర్ల జాబితా ముసాయిదా గ్రామసభ



**మండలం (విజన్ ఆంధ్ర)**
అశ్వాపురం గ్రామపంచాయతీ పరిధిలో ఓటర్ల జాబితా ముసాయిదా గ్రామసభను ఉప సర్పంచ్ తుళ్లూరిప్రకాశరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ గ్రామసభలో సర్వేలో భాగంగా సేకరించిన ఓటర్ల వివరాలను మొత్తం 11 మంది బి ఎల్ ఓ లు వార్డుల వారీగా గ్రామ ప్రజల సమక్షంలో వివరించారు. ఈ సందర్భంగా మరణించిన ఓట్లు, షిఫ్టెడ్ ఓట్లు, డబల్ ఓట్లు, పర్మినెంట్ షిఫ్టెడ్ ఓట్లు తదితర వివరాలను ప్రజలకు తెలియజేశారు. ముసాయిదా ఓటర్ల జాబితాపై ఏవైనా అభ్యంతరాలు, తప్పులు లేదా మార్పులు ఉంటే గ్రామసభలో తెలియజేయాలని ప్రజలకు సూచించారు.
ఈ కార్యక్రమంలో బి ఎల్ ఏ లు, బి ఎల్ ఓ సూపర్‌వైజర్ వేలదండి కనక మహాలక్ష్మి గారు, 11 మంది బి ఎల్ ఓలు, పంచాయతీ కార్యదర్శి యాకూబ్ , పంచాయతీ సిబ్బంది మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## వార్తా కథనానికి స్పందన..

### పార్కులో యథావిధిగా సామగ్రి ఏర్పాటు



**(విజన్ ఆంధ్ర), రాయికల్, ఆగస్టు 27:**
పెద్ద చెరువు సమీపంలోని పార్కులో వ్యాయామ పరికరాలు, సామగ్రి తొలగింపుపై గురువారం వెలువడిన వార్తా కథనానికి సంబంధిత వర్గాలు స్పందించాయి. పార్కు నుంచి తొలగించిన సామగ్రిని తిరిగి యథావిధిగా ఏర్పాటు చేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.
పార్కులో కొన్ని వ్యాయామ పరికరాలు కనిపించకపోవడం, వాటి స్థానాల్లో ఖాళీ బేస్‌లు ఉండటంతో ప్రజల్లో అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఈ విషయంపై వార్తా కథనం వెలువడిన అనంతరం పార్కు సామగ్రి అంశంపై స్పందన రావడంతో తిరిగి పరికరాలను ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది.
ప్రజల ఆరోగ్య పరిరక్షణకు, ఉదయం, సాయంత్రం వేళల్లో వ్యాయామం చేసేందుకు పార్కులో ఏర్పాటు చేసిన ఈ పరికరాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని స్థానికులు పేర్కొన్నారు. ఇకపై పార్కు సామగ్రిని సక్రమంగా నిర్వహిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంచాలని వారు కోరుతున్నారు. ప్రజా సమస్యలపై వార్తా కథనాలు వెలువడితే స్పందన రావడం అభినందనీయమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

## వైభవంగా పోచమ్మ తల్లి విగ్రహ ఊరేగింపు..

## భక్తిశ్రద్ధలతో జిన్నారంలో పోచమ్మ తల్లి విగ్రహ ఊరేగింపు



**(విజన్ ఆంధ్ర)**
జిన్నారం మున్సిపాలిటీ కేంద్రంలో పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం ఘనంగా కొనసాగుతోంది. మూడు రోజులపాటు నిర్వహిస్తున్న ఈ మహోత్సవాల్లో భాగంగా గురువారం పోచమ్మ తల్లి విగ్రహాన్ని అంగరంగ వైభవంగా జిన్నారం గ్రామంలో ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.
జిన్నారం పోలీస్ స్టేషన్ ఎదురుగా ఎంతో ప్రతిష్టాత్మకంగా ఉన్న పోచమ్మ తల్లి ఆలయాన్ని పునర్నిర్మించారు. పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి సహకారంతో పాటు పలువురు దాతలు, భక్తుల ఆర్థిక సహకారంతో ఆలయ పునర్నిర్మాణ పనులు చేపట్టి పూర్తి చేశారు. ఆలయంలో విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.
గురువారం నిర్వహించిన విగ్రహ ఊరేగింపు సందర్భంగా జిన్నారం పట్టణ వీధులు భక్తులతో కిక్కిరిశాయి. డప్పు చప్పుళ్లు, వాయిద్యాల నడుమ భక్తులు భక్తిశ్రద్ధలతో ఊరేగింపులో పాల్గొన్నారు. మహిళలు, యువత, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.
ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పటాన్‌చెరు ఇన్‌చార్జ్ ఆదర్శ్ రెడ్డి, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు శ్రీకాంత్ గౌడ్, మున్సిపల్ చైర్మన్ జనార్ధన్, స్థానిక ఎస్సై హనుమంతు, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వెంకటేశ గౌడ్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు, దాతలు, భక్తులు ఊరేగింపు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.
ఆలయ పునర్నిర్మాణంతో పాటు విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాలు నిర్వహించడంతో జిన్నారం పట్టణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. మూడు రోజులపాటు జరిగే ఈ మహోత్సవాల్లో భాగంగా ఆదివారం ప్రధాన విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.
ఆదివారం జరగనున్న విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవానికి జిన్నారం పరిసర ప్రాంతాల ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో హాజరై పోచమ్మ తల్లి ఆశీస్సులు పొందాలని ఆలయ నిర్వాహకులు కోరారు. మహోత్సవాన్ని విజయవంతం చేసేందుకు భక్తులు, దాతలు, స్థానికులు సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు.

## పీఆర్సీ ప్రకటించాలి.. సమస్యలు పరిష్కరించాలి

### జగిత్యాల కలెక్టరేట్ ఎదుట ఉద్యోగ, ఉపాధ్యాయుల మహాధర్నా



**(విజన్ ఆంధ్ర) జగిత్యాల బ్యూరో, ఆగస్టు 27:**
ఉద్యోగులు, ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ టీజీఈజేఏసీ ఆధ్వర్యంలో గురువారం జగిత్యాల కలెక్టరేట్ ఎదుట మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌యూపీపీటీఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షులు వేల్పుల స్వామి యాదవ్ మాట్లాడుతూ రెండో పీఆర్సీని తక్షణమే ప్రకటించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, ఈహెచ్‌ఎస్‌ను పూర్తిస్థాయిలో అమలు చేయాలని కోరారు. పెండింగ్ డీఏలు, ఇతర ఆర్థిక, సేవా బకాయిలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.టీజీఈజేఏసీ జిల్లా అధ్యక్షులు నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో టీజీయూఎస్ జిల్లా అధ్యక్షులు నునావత్ రాజు, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు బోగ రమేష్, బీటీఎఫ్ అధ్యక్షులు డి.శంకర్, నకుమల్ల నర్సయ్య, గోవింద్ నాయక్, రవీందర్ రెడ్డి, హరికిరణ్, సురేష్, నర్సింగరావు, మహేష్, లక్ష్మారెడ్డి, సతీష్, పవన్, అనీల్‌తోపాటు వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## లక్ష్య సాధనకు కృషి, పట్టుదల అవసరం

### ఉచిత పోలీస్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

### జగిత్యాల రూరల్ సిఐ దామెర సుధాకర్





**(విజన్ ఆంధ్ర) జగిత్యాల బ్యూరో ఆగస్టు 27:**
కృషి పట్టుదల ఉంటే మనం అనుకున్న లక్ష్యాన్ని సాధించగలుగుతామని జగిత్యాల రూరల్ సిఐ దామెర సుధాకర్ అన్నారు.వాల్మీకి ఆవాసం సేవా భారతి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత పోలీసు శిక్షణ శిబిరాన్ని రూరల్ సీఐ సుధాకర్ సందర్శించి అభ్యర్థులకు పలు సూచనలు చేశారు. ప్రణాళికాబద్ధంగా చదవడంతో పాటు శారీరక కార్యక్రమాలను నిరంతరంగా కొనసాగించినట్లయితేనే పోటీ పరీక్షలో విజయం సాధించగలుగుతారని వివరించారు. ఈ మూడు నెలల కాలంలో ఎలాంటి ఆకర్షణలకు లోను కాకుండా ఉద్యోగం సాధించాలనే పట్టుదల ఉండాలన్నారు. పోలీసు వృత్తి అనేది సమాజంలో ఒక బాధ్యత గల ఉద్యోగం అని దీన్ని సాధించడానికి శారీరక శ్రమతో పాటు విషయ పరిజ్ఞానం, క్రమశిక్షణ కఠోర పరిశ్రమ కూడా అవసరమని తెలిపారు. ఎంతోమంది గ్రామీణ యువకులకు పోలీస్ ఉద్యోగం మీద మక్కువ ఉన్నప్పటికీ ఆర్థిక భారంతో కూడిన కోచింగ్ తీసుకోలేని పరిస్థితిలో వారి పోలీస్ ఉద్యోగం కల నెరవేరడం లేదన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో వాల్మీకి ఆవాసం ద్వారా హైదరాబాద్ స్థాయిలో శిక్షణనిస్తున్నారని దీన్ని సద్వినియోగం చేసుకొని పోలీసు ఉద్యోగం సాధించాలని ఆకాంక్షించారు. దేశ సేవ, సమాజ సేవ చేయాలనే ఉద్దేశంతో శిక్షణ పొందడానికి వచ్చిన యువకులు క్రమశిక్షణతో, ప్రణాళికాబద్ధంగా చదువుకొని లక్ష్యాన్ని సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో సేవా భారతి జిల్లా అధ్యక్షులు ఎస్పి సుబ్రహ్మణ్యం, వాల్మీకి ఆవాస కార్యదర్శి మదన్మోహన్రావు, కమిటీ సభ్యులు సంపూర్ణ చారి, చంద్రశేఖర్, బొమ్మెర సత్యనారాయణ, , సురేష్, సుమన్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణానగర్ కృష్ణవేణి టాలెంట్ హై స్కూల్ లో ఘనంగా" ముందస్తు రాఖీ వేడుకలు"



**(విజన్ ఆంధ్ర) జగిత్యాల రూరల్, ఆగస్టు 27.**
స్థానిక కృష్ణా నగర్ లోని కృష్ణవేణి టాలెంట్ హై స్కూల్ లో అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక అయిన రాఖీ ముందస్తు వేడుకలు చాలా ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పాఠశాలలోని చిన్నారులు టౌన్ సి.ఐ. శ్రీ కరుణాకర్ గారికి, ట్రాఫిక్ ఎస్.ఐ. శ్రీ మల్లేశం గారికి మరియు ప్రముఖ వైద్యులు డాక్టర్ ఆకుతోట శ్రీనివాస్ రెడ్డి గారికి రాఖీలు కట్టి వారి ఆశీస్సులు పొందారు. పాఠశాల కరస్పాండెంట్ తిరుపతి రెడ్డి మాట్లాడుతూ ఈ సమైక్య భారత దేశంలో ఎన్ని కులమతాలు ఉన్నా, అన్నా చెల్లెల అనుబంధం ముందు ఏదీ గొప్ప కాదన్నారు. పాఠశాలలో యోగా,భగవద్గీత తో పాటు స్పోకెన్ ఇంగ్లీష్ క్లాసులు కూడా ప్రారంభిస్తున్నామని ప్రిన్సిపాల్ శ్రీనాథ్ తెలిపారు. కార్యక్రమంలో విజయ్ కుమార్ తో పాటు ఉపాధ్యాయినీలు సుకన్య, హిమవర్ష, రజిత, సునీత, వనితామని, మాధవి, లహరిక, మమత,రమ్య, స్రవళిక, సోనీ , జమున మరియు ఉమాదేవి గారు పాల్గొన్నారు.

# ఎయిర్‌పోర్టు కార్మికుల ఆవేదన ప్రభుత్వానికి కనిపించదా,



**- 14 రోజులుగా నిరసన... రోడ్డుపై వంటావార్పుతో కార్మికుల ఆగ్రహం,**
**- "వారం రోజులు కాదు... ఈరోజే న్యాయం చేయాలి" కార్మికుల డిమాండ్,**
**- "కార్మికుల ప్రాణాలకు ఏదైనా జరిగితే ప్రభుత్వానిదే బాధ్యత,**
**తెలుగు శక్తి అధినేత బి.వి.రామ్, రాధా రంగా రాయల్ అసోసియేషన్ గద్దె బాలాజీ హెచ్చరిక,**

**విశాఖపట్నం, ఎన్ఏడి, (విజన్ ఆంధ్ర) న్యూస్, ఆగస్టు 27,,**

విశాఖపట్నం: విశాఖపట్నం ఎయిర్‌పోర్టులో తమకు న్యాయం చేయాలంటూ కార్మికులు చేపట్టిన నిరసన కార్యక్రమం గురువారంతో 11వ రోజుకు చేరుకుంది. ఇన్ని రోజులుగా కార్మికులు ఆందోళన చేస్తున్నప్పటికీ ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ, తక్షణ పరిష్కారం లభించకపోవడంపై కార్మికుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. తమ కుటుంబాల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తూ సుమారు 300 మంది కార్మికులు వంటావార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. తమ కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతున్నాయని, ప్రతిరోజూ నిరసనలో కూర్చోవడం తమకు ఇష్టం కాదని, తమ సమస్యకు తక్షణ పరిష్కారం కావాలనే బాధతోనే రోడ్డుపైకి రావాల్సి వస్తోందని కార్మికులు స్పష్టం చేశారు. వారం రోజులు గడువు కాదు... ఈరోజే పరిష్కారం కావాలి

నిరసన చేస్తున్న కార్మికులతో విశాఖ వెస్ట్ ఎమ్మెల్యే పీ.జీ.వీ.ఆర్.నాయుడు (గణబాబు) మాట్లాడి ప్రభుత్వం అన్ని విధాలా న్యాయం చేస్తుందని, విశాఖ ఎంపీ ఎంవీ భరత్ వారంలోపు కార్మికుల సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటారని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

అయితే ఎమ్మెల్యే ఇచ్చిన ఈ హామీపై కార్మికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. "ఇప్పటికే 11 రోజులుగా రోడ్డుపై కూర్చున్నాం... ఇంకా వారం రోజులు ఎందుకు?" అంటూ ప్రశ్నించారు. తమ కుటుంబాలు ఇప్పటికే తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, మరో వారం రోజుల పాటు వేచి చూసే పరిస్థితి తమకు లేదని స్పష్టం చేశారు. "ఈరోజే మాకు న్యాయం చేయాలి. ఇక ఆలస్యం చేయొద్దు" అంటూ కార్మికులు ప్రభుత్వాన్ని నిలదీశారు. తమ బాధను పట్టించుకోకుండా కాలయాపన చేస్తే తమ పరిస్థితి మరింత దయనీయంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

మమ్మల్ని చంపేయండి... కానీ సమస్యను ఇక వాయిదా వేయొద్దు,

మహిళా కార్మికులు వై.సునీత, బి.జ్యోతి,

తమ సమస్య పరిష్కారంపై తీవ్ర ఆవేదనకు గురైన కొందరు కార్మికులు "ఈరోజే మాకు న్యాయం చేయాలి... లేకపోతే మమ్మల్ని చంపేయండి" అంటూ మహిళా కార్మికులు వై.సునీత, బి.జ్యోతి కన్నీటి పర్యంతమయ్యారు. ఈ మాటలు కార్మికులు ఎదుర్కొంటున్న మానసిక, ఆర్థిక ఒత్తిడికి అద్దం పడుతున్నాయని పలువురు పేర్కొన్నారు.

కార్మికులు ఇంత తీవ్ర స్థాయిలో ఆవేదన వ్యక్తం చేస్తున్నప్పటికీ సమస్యను మరింత ఆలస్యం చేయడం సరికాదని, ప్రభుత్వం వెంటనే స్పందించి చర్చలు జరిపి పరిష్కారం చూపాలని వారు కోరుతున్నారు.

నారా లోకేష్‌ను కలసి న్యాయం కోరనున్న కార్మికులు ఇదిలా ఉండగా రాష్ట్ర మంత్రి నారా లోకేష్ గురువారం సాయంత్రం విశాఖపట్నం రానున్న నేపథ్యంలో, ఆయనను కలిసి తమ సమస్యలను నేరుగా వివరించి న్యాయం చేయాలని కార్మికులు నిర్ణయించారు. 11 రోజులుగా కొనసాగుతున్న తమ నిరసనకు ముగింపు పలికేలా మంత్రి నారా లోకేష్ తక్షణమే జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని కార్మికులు కోరుతున్నారు.

"ప్రభుత్వంపై మాకు నమ్మకం ఉంది... కానీ ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వానిదే" అని కార్మికులు స్పష్టం చేస్తున్నారు.

కార్మికుల సమస్యను ప్రభుత్వం ఇంతకాలం ఎందుకు పట్టించుకోలేదు?

కార్మికుల పోరాటానికి మొదటి నుంచి అండగా ఉంటూ, వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్న తెలుగు శక్తి అధినేత బి.వి.రామ్, రాధా రంగా రాయల్ అసోసియేషన్ గద్దె బాలాజీ మాట్లాడుతూ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఎయిర్‌పోర్టు కార్మికులు 11 రోజులుగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా ప్రభుత్వం కనీసం పట్టించుకోకపోవడం దౌర్భాగ్యకరమన్నారు. కార్మికుల కుటుంబాల పరిస్థితి రోజురోజుకూ దయనీయంగా మారుతున్న సమయంలో మరో వారం రోజులు గడువు అడగడం ఏమాత్రం సమర్థనీయం కాదని అన్నారు.

కార్మికులకు జీతం వస్తేనే వారి కుటుంబాలు నడుస్తాయని, నెలాఖరు సమీపిస్తున్న తరుణంలో ఇంటి అద్దెలు, పిల్లల ఫీజులు, నిత్యావసర సరుకులు, ఇంటి ఖర్చులు ఇలా ప్రతి విషయంలోనూ వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

"కార్మికుల కుటుంబాలు ఇప్పటికే రోడ్డున పడ్డాయి. వారి సమస్యను వారం రోజులకు వాయిదా వేయడం అంటే వారి బాధను మరింత పెంచడమే" అని అన్నారు.

"కార్మికుల ప్రాణాలతో ప్రభుత్వం చెలగాటం ఆడొద్దు"

కార్మికులు తీవ్ర ఆవేదనలో ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే స్పందించాలని బీవీ రామ్ డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యను ఈరోజే పరిష్కరించాలని, మరోసారి గడువు పేరుతో కాలయాపన చేయవద్దని కోరారు. కార్మికులు ఆందోళనలో ఉండగా వారి ప్రాణాలకు ఎలాంటి ప్రమాదం జరిగినా దానికి ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. "కార్మికుల సమస్య చిన్న సమస్యగా భావించొద్దు. వారి వెనుక వందలాది కుటుంబాలు ఉన్నాయి. ఒక్కో కార్మికుడి కుటుంబ జీవనం వారి ఉద్యోగంపైనే ఆధారపడి ఉంది" అని బీవీ రామ్ అన్నారు. ప్రభుత్వం వెంటనే అధికారులను రంగంలోకి దించి కార్మికులతో చర్చలు జరిపి, వారి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు.

"11 రోజుల పోరాటానికి ఇక ముగింపు పలకాలి"

ఎయిర్‌పోర్టు కార్మికుల 11 రోజుల నిరసనకు ప్రభుత్వం వెంటనే స్పందించి న్యాయం చేయాలని తెలుగు శక్తి డిమాండ్ చేసింది. కార్మికులు, వారి కుటుంబాలు మరింత ఇబ్బందులు పడకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని కోరింది.

ప్రభుత్వం ఇచ్చే హామీలు కేవలం మాటలకే పరిమితం కాకుండా అమల్లోకి రావాలని, కార్మికులకు స్పష్టమైన భరోసా ఇవ్వాలని బి.వి.రామ్ డిమాండ్ చేశారు.

కార్మికుల సమస్య పరిష్కారం అయ్యే వరకు వారి పక్షాన తెలుగు శక్తి పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు

ఈ కార్యక్రమంలో డాక్టర్ పప్పూరు నికుంజ్, వై.శివప్రసాద్ పి.ఆనంద్ తదితరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు ఎయిర్‌పోర్టు కార్మికులు, వారి కుటుంబ సభ్యులు, ప్రజలు,

# పారిశుధ్య కార్మికులకు కొబ్బరినూనె, సబ్బులు అందజేసిన ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

**విశాఖపట్నం, దక్షిణ నియోజకవర్గ, (విజన్ ఆంధ్ర) న్యూస్, ఆగస్టు 27,,**



విశాఖపట్నం: సౌత్ జోనల్ కార్యాలయంలో ఈరోజు స్థానిక శాసనసభ్యులు శ్రీ వంశీకృష్ణ శ్రీనివాస్ పలువురు పారిశుధ్య కార్మికులకు కొబ్బరినూనె, సబ్బులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ.. నగరంలోని వీధులు, రహదారులను పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుధ్య కార్మికులు నిరంతరం ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. ఎండ, వర్షాలను సైతం లెక్కచేయకుండా ప్రజల ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రత కోసం సేవలందిస్తున్న పారిశుధ్య కార్మికుల ఆరోగ్యం కూడా బాగుండేలా అవసరమైన సహకారం అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.పారిశుధ్య కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని కూటమి ప్రభుత్వం కొబ్బరినూనె, సబ్బులు పంపిణీ చేయడం అభినందనీయమైన చర్య అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్మికుల సంక్షేమం, ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం మరింత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సౌత్ జోనల్ కమిషనర్ మల్లయ్య నాయుడు తో పాటు జోనల్ కార్యాలయ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

# అమరావతిలో పీయూసీ సమావేశాలు నిర్వహించిన, ఎమ్మెల్యే మరియు రాష్ట్ర పియుసి చైర్మన్ కూన రవికుమార్ ప్రభుత్వ సంస్థల పనితీరు, నిధుల వినియోగంపై,సమీక్షలు.





**అమరావతి, ఆమదలవలస, (విజన్ ఆంధ్ర) న్యూస్, ఆగస్టు 27,,**

ఆంధ్రప్రదేశ్ శాసనసభ పబ్లిక్ అండర్‌టేకింగ్స్ కమిటీ (పీయూసీ) చైర్మన్, ఆమదాలవలస నియోజకవర్గ శాసనసభ్యులు కూన రవికుమార్ అధ్యక్షతన అమరావతిలో పలు ప్రభుత్వ సంస్థలతో పీయూసీ సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాల్లో ఆయా సంస్థల పనితీరు, నిధుల వినియోగం, అమలు చేస్తున్న కార్యక్రమాలు, అభివృద్ధి పనుల పురోగతి తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు.

సమగ్ర శిక్ష, ఏపీ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అసెట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్, ఏపీకో, ఏపీ ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డు, ఏపీ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఉన్నత అధికారులు తో పీయూసీ సమావేశాలు నిర్వహించి ఆయా సంస్థల కార్యకలాపాలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు.ప్రభుత్వం కేటాయిస్తున్న నిధులు నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా, ప్రజా ప్రయోజనాలకు సమర్థవంతంగా వినియోగించబడుతున్నాయా లేదా అనే అంశంపై పీయూసీ నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తోందని కూన రవికుమార్ పేర్కొన్నారు. ప్రభుత్వ సంస్థలు మరింత పారదర్శకంగా, జవాబుదారీతనంతో పనిచేసేలా పీయూసీ తన పర్యవేక్షణ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తుందని తెలిపారు.ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు ప్రభుత్వ నిధుల సద్వినియోగం జరిగేలా సంబంధిత సంస్థలు మరింత బాధ్యతాయుతంగా పనిచేయాలని ఈ సందర్భంగా చైర్మన్ సూచించారు.

# మహిళల ఆరోగ్యం, పీసీఓఎస్ మరియు రుతుక్రమ పరిశుభ్రతపై వీఐఐటీ దువ్వాడలో అవగాహనా కార్యక్రమం

**విశాఖపట్నం, దువ్వాడ, (విజన్ ఆంధ్ర) న్యూస్, ఆగస్టు 27,,**







విశాఖపట్నం, దువ్వాడలోని విజ్ఞాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (అటానమస్), విశాఖపట్నం, కిమ్స్ కడిల్స్ మదర్ అండ్ చైల్డ్ సెంటర్ సహకారంతో మహిళల ఆరోగ్యం మరియు శ్రేయస్సుపై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించింది. "మహిళల ఆరోగ్యం మరియు శ్రేయస్సు విద్యార్థినులకు పీసీఓఎస్‌పై అవగాహన మరియు రుతుక్రమ పరిశుభ్రత" అనే అంశంపై నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుమారు 200 మంది విద్యార్థినులు చురుకుగా పాల్గొన్నారు. విద్యార్థినుల్లో మహిళల ఆరోగ్యం, రుతుక్రమ పరిశుభ్రత, పాలీసిస్టిక్ ఓవరీ సింద్రోమ్ (పీసీఓఎస్), ఆరోగ్యకరమైన జీవనశైలి మరియు అవసరమైన సమయంలో వైద్యుల సలహా తీసుకోవడం వంటి అంశాలపై అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశంగా ఉంది.

ఈ కార్యక్రమంలో డాక్టర్ జ్యోత్స్న యెర్నాగుల, ఎంబీబీఎస్, ఎంఎస్ (ప్రసూతి మరియు స్త్రీ వైద్యం), మినిమల్ యాక్సెస్ సర్జరీలో ఫెలోషిప్, కన్సల్టెంట్ ప్రసూతి మరియు స్త్రీ వైద్య నిపుణురాలు, విద్యార్థినులను ఉద్దేశించి ప్రసంగించారు. రుతుక్రమ ఆరోగ్యం, పీసీఓఎస్, దాని సాధారణ లక్షణాలు మరియు ప్రమాద కారకాలు, వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు మెరుగైన ఆరోగ్యానికి దోహదపడే జీవనశైలి మార్పులపై ఆమె విలువైన సమాచారాన్ని అందించారు.

ఈ అవగాహనా కార్యక్రమం ద్వారా విద్యార్థినులు తమ ఆరోగ్యం పట్ల మరింత అవగాహన పెంపొందించుకోవడంతో పాటు, ఆరోగ్య సమస్యలకు సంబంధించిన ప్రారంభ హెచ్చరిక సంకేతాలను గుర్తించి, అవసరమైనప్పుడు తగిన వైద్య సలహా తీసుకోవాల్సిన ప్రాముఖ్యతను తెలుసుకున్నారు. సాధారణంగా బహిరంగంగా చర్చించడానికి సంకోచించే మహిళల ఆరోగ్య అంశాలపై విద్యార్థినులు తమ సందేహాలను నివృత్తి చేసుకునేందుకు ఈ కార్యక్రమం ఒక చక్కని వేదికగా నిలిచింది.

ఈ కార్యక్రమాన్ని బేసిక్ సైన్సెస్ అండ్ హ్యూమానిటీస్ (బీఎస్ అండ్ హెచ్) విభాగం, శ్రీమతి కె. స్వాతి, విభాగాధిపతి, సీ.ఎస్.ఈఏఐ, మరియు డాక్టర్ కె. మృదులాదేవి, మహిళా రక్షణ మరియు సాధికారత విభాగం సమన్వయంతో నిర్వహించింది.

ఈ సందర్భంగా డాక్టర్ జె. సుధాకర్, ప్రిన్సిపాల్; డాక్టర్ వి. మధుసూదన రావు, రెక్టర్; మరియు డాక్టర్ ఎ. నాగ జ్యోతి, డీన్‌అకాడమిక్స్, కార్యక్రమాన్ని అభినందిస్తూ, విద్యార్థినుల్లో మహిళల ఆరోగ్యం, నివారణాత్మక ఆరోగ్య సంరక్షణ మరియు ఆరోగ్యకరమైన జీవనశైలిపై అవగాహన కల్పించడం ఎంతో అవసరమని పేర్కొన్నారు.

యువతుల్లో ఆరోగ్యంపై అవగాహన, ఆత్మవిశ్వాసం మరియు శ్రేయస్సును పెంపొందించడంతో పాటు, తమ ఆరోగ్యానికి సంబంధించి సరైన నిర్ణయాలు తీసుకునేలా విద్యార్థినులను సాధికారత కల్పించడంలో ఈ కార్యక్రమం ఒక అర్థవంతమైన

# కాసు శేషమ్మ చిత్రపటానికి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి



**పల్నాడు జిల్లా బ్యూరో. నరసరావుపేట. (విజన్ ఆంధ్ర)**

హైదరాబాద్ లో మాజీ మంత్రి కాసు వెంకట కృష్ణారెడ్డి మాతృమూర్తి కాసు శేషమ్మ (పెద్దకర్మ) కార్యక్రమంలో బుధవారం పాల్గొని వారి చిత్రపటానికి నివాళులు అర్పించిన పల్నాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నరసరావుపేట మాజీ శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ,ప్రముఖ పెద్దలు మరియు వైఎస్ఆర్సిపి నాయకులు పాల్గొన్నారు.

# 25 ఏళ్లుగా నిరంతర అన్నదానం..






**కాణిపాకం ఆగస్టు 27 విజన్ ఆంధ్ర ప్రతినిధి**

దిన దిన అభివృద్ధి చెందుతున్న నిత్య అన్నదాన సత్రం కాణిపాకం ఈ సత్రం గతంలో 2000 సంవత్సరంలో ఒక భవనంలో ప్రారంభించి ఈరోజు సత్రానికి సొంత భవనం తో నడుస్తున్నది దీనికంతటికి కారణం ఈ సత్రం ఆర్యవైశ్యులైన ఈ సత్ర కమిటీ వారు ప్రతి సంవత్సరం విద్య అభివృద్ధి చెందాలని ఉభయ రాష్ట్రాల్లోనూ వీరికి తోచిన విధంగా ప్రాథమిక పాఠశాల నుండి కళాశాల వరకు ఉచిత పుస్తకాలు బ్యాగులు వీరికి తోచిన విధంగా ట్రస్ట్ వారిచే అందించడం జరుగుతున్నది అలాగే ఈ ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రం గత 25 సంవత్సరాల నుండి ప్రతినిత్యము అన్నదానము జరపడం జరుగుతున్నది ఈ సత్రం 25 సంవత్సరాలు పూర్తి చేసుకుని

